మీ ఆత్మీయులలో...స్నేహితులలో... సన్నిహితులలో... ఎవరికైనా... ఎలాంటి శుభ సందర్భమైనా మీ హృదయపూర్వక శుభాకాంక్షలు... విజయభాను ద్వారా అందించండి!
విజయభాను
# 9-3-17, PITHAPURAM COLONY , VISAKHAPATNAM-530 003
❖ Phone : 2564353, Fax : 0891-2569004

విజయభాను

45 వ వార్షికోత్సవం
విజయభాను

విశాఖపట్నం, బుధవారం 07-09-2022 VIJAYABHANU DAILY * VISAKHAPATNAM సంపుటి : 45 సంచిక : 298 పేజీలు : 08 వెల : 1 రూపాయి

# దశాబ్దాల స్వప్నం సాకారం

## 'వైఎస్సార్ ప్రారంభించిన ప్రాజెక్ట్‌ను పూర్తి చేసినందుకు గర్వపడుతున్నా'

## నెల్లూరు బ్యారేజ్‌ను ప్రారంభించిన సీఎం జగన్



నెల్లూరు జిల్లా (విజయభాను న్యూస్) : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మంగళవారం నెల్లూరు జిల్లా పర్యటనలో సంగం వద్ద పెన్నానదిపై నిర్మించిన మేకపాటి గౌతమ్‌రెడ్డి సంగం బ్యారేజీని, నెల్లూరు వద్ద నిర్మించిన నెల్లూరు బ్యారేజీను మేకపాటి కుటుంబ సభ్యులతో కలిసి ప్రారంభించారు. అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన బహిరంగ సభలో సీఎం జగన్ ప్రసంగించారు. ఐదు లక్షలు ఎకరాలకు.. ఆత్మకూరు, కోవూరు, సర్వేపల్లి, కావలి నియోజక వర్గాలకు మేలు చేకూరే విధంగా ఈ ప్రాజెక్ట్ ప్రారంభించామని సీఎం జగన్ తెలిపారు. రాష్ట్రంలో సమృద్ధిగా వర్షాలు కురుస్తున్నాయి. గత మూడున్నర ఏళ్లుగా ఒక మండలం కూడా కరువు మండలంగా ప్రకటించలేదు అని పేర్కొన్నారు. ఈ రెండు ప్రాజెక్ట్‌లను రూ.320 కోట్లతో పూర్తి చేసినట్లు వివరించారు.

''సంగం ప్రాజెక్ట్‌ను ప్రాధాన్యత ప్రాజెక్ట్‌గా వేగం తరువాయి 2లో..

# రండి మళ్లీ చర్చిద్దాం...

## ఉద్యోగ సంఘాలకు మంత్రి బొత్స పిలుపు



అమరావతి: ఆంధ్రప్రదేశ్‌లో కాంట్రిబ్యూటరీ పింఛను పథకం (సీపీఎస్) రద్దు కోసం ఉద్యమిస్తున్న ఉద్యోగ సంఘాలకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి మరోసారి పిలుపొచ్చింది. ఈరోజు చర్చలకు రావాలని ఏపీసీపీఎస్‌ఈఏ, ఏపీసీపీఎస్‌యూఎస్ సంఘాలను మంత్రి బొత్స సత్యనారాయణ ఆహ్వానించారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి దృష్ట్యా సీపీఎస్ స్థానంలో ప్రభుత్వం గ్యారంటీ పింఛను పథకం (జీపీఎస్) అమలు చేస్తామని ఇప్పటికే ప్రభుత్వం ఉద్యోగ సంఘాలకు తెలిపింది. దీనిపై ఉద్యోగులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. తాజాగా మంత్రి బొత్సతో జరిగే సమావేశంలో ప్రభుత్వం గ్యారంటీ పింఛను పథకం (జీపీఎస్)పై చర్చ అంటే ఏం చేయాలన్న దానిపై ఉద్యోగ సంఘాలు తర్జన భర్జన పడుతున్నాయి. అసలు సమావేశానికి వెళ్లాలా? వద్దా. అన్న సందిగ్ధంలో ఉద్యోగులు ఉన్నట్లు తెలుస్తోంది. జీపీఎస్‌కు అంగీకరించేది లేదని ఇప్పటికే ఉద్యోగ సంఘాలు ప్రభుత్వానికి స్పష్టం చేశాయి. ఈ విషయాన్ని గతంలోనే బొత్సకు తెలిపాయి. ఓపీఎస్ మినహా ఏ ప్రతిపాదనకూ అంగీకరించేది లేదని ఉద్యోగ సంఘాల నేతలు చెబుతున్నారు.

ఇప్పటికే చలో విజయవాడ, మిలియన్ మార్చ్ సభల అనుమతికి ఉద్యోగ సంఘాలు యత్నిస్తుండటం, నిరసనకు ఏర్పాట్లు జరుగుతున్న నేపథ్యంలో ప్రభుత్వం నుంచి పిలుపురావడం చర్చనీయాంశమైంది.

# ఏపీలో 8 ప్రధాన ఆలయాల్లో ఆన్‌లైన్ సేవలు..



అమరావతి,(విజయభాను న్యూస్) : రాష్ట్రంలో ఎనిమిది ప్రధాన ఆలయాల్లో ఆన్‌లైన్ సేవలను ప్రారంభించనున్నట్టు ఏపీ దేవాదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ వెల్లడించారు. కాణిపాకం, శ్రీశైలం, ఇంద్రకీలాద్రి, అన్నవరం, పెనుగంచిప్రోలు, సింహాచలం, వాడపల్లి, అయినవిల్లి ఆలయాల్లో ఈ నెల 20 నుంచి ఆన్‌లైన్ సేవల్ని అందుబాటులోకి తీసుకురానున్నట్టు తెలిపారు. భక్తుల రద్దీ అధికంగా ఉండే మరో 10 ఆలయాల్లోనూ ఆన్‌లైన్ సేవలు కల్పించాలని భావిస్తున్నట్టు చెప్పారు. అక్టోబర్ 10న ధార్మిక పరిషత్ తొలి సమావేశం జరుగుతుందన్నారు. ఇంద్రకీలాద్రిలో దసరా ఉత్సవాలకు ఏర్పాట్లు చురుగ్గా జరుగుతున్నాయని.. ఉచిత, రూ.300 దర్శనాలకు వచ్చేవారికి ఘాట్ రోడ్డు ద్వారా అనుమతించనున్నట్టు మంత్రి వెల్లడించారు. సాధారణ భక్తులకు ఇబ్బంది లేకుండా వీఐపీల కోసం ప్రత్యేక టైం స్లాట్‌ని కేటాయిస్తున్నామన్నారు.

"ఉద్యోగుల పదోన్నతులపై కసరత్తులు కొనసాగుతున్నాయి. ఇప్పటికే ముగ్గురికి డీసీలుగా పదోన్నతి కల్పించాం. అక్టోబర్ 10న ధార్మిక పరిషత్ తొలి సమావేశం నిర్వహిస్తాం. ట్రిబ్యునల్‌లో పెండింగ్‌లో ఉన్న కేసులు పరిష్కారంపై దృష్టి సారించాం. ఇప్పటికే ఛైర్మన్ ఉన్నారు. విశ్రాంత ఐఏఎస్ పద్మని సభ్యురాలిగా నియమించాం. ప్రతి మంగళవారం తరువాయి 2లో..

## కాకినాడలో ఊపిరాడక 30 మంది

# విద్యార్థులకు అస్వస్థత..



కాకినాడ జిల్లా: కాకినాడ రూరల్‌లోని వలసపాకల కేంద్రీయ విద్యాలయంలో విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. 5, 6 తరగతి గదుల్లో ఊపిరాడక 30 మంది స్కూల్ పిల్లలు కళ్లు తిరిగి పడిపోయారు. వీరిని వలసపాకలలోని ఓ ప్రైవేట ఆస్పత్రికి తరలించారు. అస్వస్థతకు గల కారణాలను టీచర్స్, విద్యార్థులు స్పష్టంగా చెప్పలేకపోతున్నారు. కాగా తమ పిల్లలకు ఏమైందోనని విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. విద్యార్థులు, తల్లిదండ్రుల రోదనలతో స్థానికంగా హృదయ విదారక పరిస్థితులు నెలకొన్నాయి. ఇక అస్వస్థతకు గురైన కేంద్రీయ విద్యాలయం విద్యార్థులు జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్నారు. ప్రస్తుతం విద్యార్థులు కోలుకుంటున్నారు. విద్యార్థుల అస్వస్థతకు గల కారణాలు తెలుసుకునేందుకు రక్త నమూనాలను వైద్యులు సేకరించారు.

**మంత్రి ఆరా**

కాకినాడ వలసపాకలలోని కేంద్రీయ విద్యాలయ విద్యార్డులు అస్వస్థతకు గురైన తరువాయి 2లో..

# ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం కాకుండా తగు చర్యలు చేపట్టాలి

## - జిల్లా కలక్టర్ డా.ఎ.మల్లిఖార్జున



విశాఖపట్నం (విజయభాను న్యూస్) : ప్రభుత్వ భూములు ఎట్టి పరిస్థితులలో అన్యాక్రాంతం కాకుండా కాపాడవలసిన బాధ్యత రెవెన్యూ ఉద్యోగులపై ఉందని జిల్లా కలక్టర్ డా.ఎ.మల్లిఖార్జున అన్నారు. మంగళవారం ఉదయం జిల్లా కలక్టర్ కార్యాలయ సమావేశమందిరంలో నిర్వహించిన రెవెన్యూ అధికారుల వర్క్ షాప్ లో జిల్లా కలక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెవెన్యు అధికారులు నూతన చట్టాలు, నిబంధనలపై అవగాహన పెంచుకొని, సాంకేతికత పరిజ్ఞానాన్ని వినియోగించుకుంటూ మంచి ఫలితాలు సాధించాలన్నారు. ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం అయినట్లు తెలిసిన వెంటనే సర్వేయర్, రెవెన్యూ అధికారులు సంబంధిత భూ కబ్జాదారులకు నోటీసులు జారీ చేయాలన్నారు. అవసరమైతే జాయింట్ కలక్టర్, రెవెన్యూ డివిజన్ అధికార్లు తనిఖీలు నిర్వహించి ప్రభుత్వ భూములు కబ్జా కాకుండా కాపాడాలన్నారు. అదే విదంగా అన్యాక్రాంతమైన ప్రభుత్వ భూములను రక్షించిన వివరాలను ప్రజలకు తెలియజేయాలన్నారు. ప్రభుత్వ భూములు కబ్జా చేసిన వారిపై క్రిమినల్ కేసులు నమోదు తరువాయి 2లో..


# శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో ప్రివిలేజ్డ్ దర్శనాలు రద్దు

## సామాన్య భక్తులకు పెద్దపీట

తిరుమల : తిరుమలలో రెండేళ్ల తర్వాత శ్రీవారి బ్రహ్మోత్సవ వాహనసేవలను మాడ వీధుల్లో నిర్వహించేందుకు టీటీడీ ఏర్పాట్లు చేస్తోంది. ఈ నెల 26 నుంచి అక్టోబర్ 5వ తేదీ వరకు తిరుమలలో శ్రీవారి బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నారు. కరోనా కారణంగా గతంలో రెండు బ్రహ్మోత్సవాలు శ్రీవారి ఆలయంలో ఏకాంతంగా నిర్వహించిన విషయం తెలిసిందే. ఈసారి బ్రహ్మోత్సవాలకు పెద్దసంఖ్యలో భక్తులు విచ్చేసే అవకాశం ఉంది. దీంతో సామాన్య భక్తులకు పెద్దపీట వేస్తూ సర్వదర్శనం మాత్రమే అమలు చేయాలని టీటీడీ నిర్ణయించింది. బ్రహ్మోత్సవాల రోజుల్లో భక్తుల రద్దీని దృష్టిలో పెట్టుకుని వీఐపీ బ్రేక్ దర్శనాలు, వృద్ధులు, దివ్యాంగులు, చంటిపిల్లల తల్లిదండ్రులకు ప్రత్యేక దర్శనం తదితర ప్రివిలేజ్డ్ తరువాయి 2లో..









# జివిఎంసికి యూనియన్ బ్యాంక్ క్లాత్ బ్యాగులు వితరణ



విశాఖపట్నం (విజయభాను న్యూస్) : నగరంలో ప్లాస్టిక్ నిర్మూలనకు వివిధ బ్యాంకులు ముందుకు రావడం అభినందనీయమని జివిఎంసి కమిషనర్ డాక్టర్ జి. లక్ష్మీశ తెలిపారు. మంగళవారం జివిఎంసి ప్రధాన కార్యాలయంలో ఆయన ఛాంబర్ లో యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రీజనల్ డైరక్టర్ కె. నటరాజ్ కమిషనర్ ను కలిసారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ జివిఎంసి ప్లాస్టిక్ నిర్మూలనకు చేస్తున్న కృషికి యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వారు ముందుకు వచ్చి, ప్లాస్టిక్ నిర్మూలన లో భాగంగా 5 వేల క్లాత్ బ్యాగులు అందించేందుకు ముందుకు వచ్చారని, ముందుగా ఒక వెయ్యి క్లాత్ బ్యాగులను ప్రస్తుతం అందించారని, మిగిలిన 4 వేలు క్లాత్ బ్యాగులు, బ్యాంకు కు వచ్చిన ఖాతాదారులకు అందించాలని సూచించామని తెలిపారు. అందరి కృపతో విశాఖ నగరాన్ని ప్లాస్టిక్ రహిత నగరంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నామని, ఈ సందర్భంగా మీ వద్దకు వచ్చే ఖాతాదారులకు ప్లాస్టిక్ పై అవగాహన కల్పించి క్లాత్ బ్యాగులను ఉపయోగించేలా చూడాలని విజ్ఞప్తి చేసారు. అనంతరం బ్యాంకు రీజనల్ డైరెక్టర్ మాట్లాడుతూ జివిఎంసి కమిషనర్ వారి విన్నపం మేరకు ప్లాస్టిక్ నిర్మూలనకు మా వంతు కృషి చేస్తామని మా బ్యాంకులోను, మా వద్దకు వచ్చే ఖాతాదారునకు ప్లాస్టిక్ ఫ్రీ అవగాహన కల్పిస్తామని కమిషనర్ కు హామీ ఇచ్చారు.

# కలెక్టరేట్ వద్ద ధర్నాను జయప్రదం చేయండి



అనంతగిరి విజయభాను న్యూస్ : సెప్టెంబర్ 20 దిన పాడేరు కలెక్టరేట్ వద్ద ధర్నాను జయప్రదం చేయండి అనంతగిరి పి. హెచ్.సి రాష్ట్ర వ్యాప్తంగా సెప్టెంబర్ 20 న జరిగే ధర్నా పిలుపు ను ఉద్దే శించి సి. ఐ.టి. యు. మండల కమిటీ సభ్యుడు జన్ని సుబ్బారావు మాట్లాడుతూ ఆశా వర్కర్లు కు కమ్యూనిటీ హెల్త్ వర్కర్స్ కు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలి సి. హెచ్.డబ్ల్యు లను ఆశాలుగా మార్చాలిపనిభారం తగ్గించాలి . సంబంధం లేని పనులు చేయించరాదుపది లక్షల గ్రూప్ ఇన్సూరెన్స్ అమలు చేయాలి పది వేలు వేతనం ఒకే సారి ఇవ్వాలి ఎ. ఎన్.ఎం హెల్త్ సెక్రటరీల నియమాలలో వేయిటేజి ఇవ్వాలి. పలు సమస్యలు పరిష్కారనీకై అందరూ సి.హెచ్. డబ్ల్యులను ఆశాలు సెప్టెంబర్ 20 తేది న పాడేరు కలెక్టరేట్ వద్ద ధర్నా కు కదలి రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ వర్కర్స్ ఆశాకార్యకర్తలు ఉన్నారు.

## యువనేత శేఖర్ కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన చింతకాయల



పరవాడ : పరవాడ మండలం భరణికం గ్రామ పంచాయతీ సర్పంచ్ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ పరవాడ మండలం యువజన విభాగం అధ్యక్షులు పెద్దిశెట్టి శేఖర్ కి అనకాపల్లి జిల్లా సర్పంచ్ ల సంఘం అధ్యక్షులు , ముత్యాల మ్మపాలెం గ్రామ సర్పంచ్ చింతకాయల సూజాత ముత్యాలు పుష్పగుచ్చం అందజేసి పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలియ జేశారు. ఈ సందర్భంగా అయన మాట్లడుతూ పెదిశెట్టిశేఖర్ ఇటువంటి జన్మదిన వేడుకులు మరిన్నీ జరిపికోవాలానీ అకాక్షించారు. ఈ కార్యక్రమంలో మాజీ కోఆపరేటివ్ బ్యాంకు డైరెక్టర్ సూరాడ ముత్యాలరావు , గ్రామ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# శరవేగంగా పెదచెరవు వంతెన నిర్మాణ పనులు

### ఎమ్మేల్యే అదీప్ కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపిన రెడ్డి శ్రీను





పరవాడ : మండల కేంద్రమైన పరవాడలో పెదచెరువు వంతెన నిర్మాణకోసమై రాంఖీ పౌండేషన్ వారు సుమారు పది లక్షలు రూపాయాలు వెచ్చించి వంతెన నిర్మాణానికి శ్రీకారముచుట్టారు. ఇటీవలే పెదచెరువు అయకట్టుదారుల సంఘం ప్రెసిడెంట్ రెడ్డి శ్రీనువాసురావు అద్వర్యంలో పరవాడ ఎంపిపి పైల వెంకటపద్మలక్ష్మి శ్రీనువాస్ పెదచెరువు వంతెన నిర్మాణానికి భూమి పూజ చేసిన సంగతీ తెలిసిందే..ఈ వంతెన నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ఈ పనులును పెదచెరువుఅయకట్టుదారుల సంఘం ప్రెసిడెంట్ రెడ్డి శ్రీనువాసురావు మంగళవారం పరిశీలించారు. వంతెన నిర్మాణపనులును త్వరితగతంగా పూర్తిచేయాలానీ కాంట్రాక్టర్ బత్తిఅప్పారావుకు సూచించారు.

వర్షాకాలంలో పెద్దచెరువు రైతులు ఎదుర్కొంటున్న సమస్యలు గుర్తించి స్దానిక శాసనసభ్యులు అన్నంరెడ్డి అదీప్ రాజ్ కృషితో రాంఖీ పౌండేషన్ వారు ముందుకు వచ్చి పెద్దచెరువు వద్ద వంతెనను నిర్మించడం ఎంతో అభినందనీయమనీ కొనియాడారు. ఈమేరకు స్దానక శాసనసభ్యులు అన్నంరెడ్డి అదీప్ రాజ్ కు, ఎంపిపి పైల వెంకట పద్మలక్ష్మిశ్రీనువాస్ కు, జడ్పిటిసి పియస్ రాజ్ కు పెద్దచెరువు అయకట్టుదారుల సంఘం తరుపున రెడ్డిశ్రీనువాసురావు ప్రత్యేక ధన్యవాదములు తెలియపరిచారు.

# స్వతంత్రనగర్లో బారి అన్నసమారాధన



మధురవాడ (విజయభాను న్యూస్) : ఆ గణనాధుని ఆసిస్సులు ప్రతిఒక్కరు పై ఉండాలని 5వ వార్డ్ కార్పొరేటర్ మొల్లిహేమలత అన్నారు. స్వతంత్రనగర్ (ఓపెన్ జిమ్ పార్క్)లో స్వతంత్రనగర్ యూత్ బాయ్స్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన శ్రీవరసిద్ధి వినాయకుని మహోత్సవాల్లో భాగంగా మహాఅన్నదాన కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కార్పొరేటర్ మొల్లిహేమలత, రమణ దంపతులు పాల్గొన్ని సుమారు 2500మందికి మహాఅన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో పురోహితులు అధికార్ల కాళిదాసు,కనకదుర్గ ఈవెంట్స్ అధినేత కొర్రాయిసురేష్, ఇయ్యపునాయుడు, జోగేశ్వరపాత్రో,స్వతంత్రనగర్ యూత్ బాయ్స్ సభ్యులు ఆలీ,మనీష్,సతీష్, అవినాష్,హేమంత్,త్రినాధ్, జగదీష్,జాన్,రమ,లక్ష్మి మాలతి,ఉమా తదితరులు పాల్గొన్నారు.

# మాజీ సర్పంచ్ పొట్టమ్మను పరామర్శి



*ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్న, యన్ ఆర్ పురం మాజీ సర్పంచ్ పొట్టమ్మను పరామర్శించిన మార్కెట్ యార్డ్ డైరెక్టర్, కొర్రసూర్యనారాయణ, కొత్తూరు సర్పంచ్ సీతయ్య, చిలకల గెడ్డ సర్పంచ్, అప్పారావు,*

అనంతగిరి, విజయభాను న్యూస్ : అనంతగిరి, మండలంలోని యన్ఆర్ పురం పంచాయతీ మాజీ సర్పంచ్, పొట్టమ్మ , అనారోగ్యంతో శృంగవరపుకోట ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విషయం తెలుసుకున్న అరకు లోయ శాసనసబ్యులు చెట్టిఫల్గుణ ఆదేశాలమేరకు ఆమెను పరా మర్శించడంజరిగిందని , ఆమె యోగక్షేమాలు తెలుసుకున్న వారు, ఆమె తొందరగా కోలుకోవాలని కోరుకున్నట్లు వారు పత్రికలకు తెలిపారు.

# లారస్ ల్యాబ్స్ సేవలు అభినందనియం

### అంబులెన్స్ ను అందజేసిన లారస్ సిఇఒ చావా



పరవాడ : జూబ్లిహిల్స్ హౌసింగ్ కోపరేటివ్ సోసైటీ ప్రేమీలరాణికి లారస్ ల్యాబ్స్ సిఇఒ డాక్టర్ చావాసత్య నారాయణ అంబులెన్స్ అందజేసారు. అనంతరము అమె మాట్లడుతూ లారస్ ల్యాబ్స్ సేవలు అభినందనీయమనీ కొనియాడారు.

మొదటి పేజీ తరువాయి

# దశాబ్దాల స్వప్నం సాకారం



పెంచాం, పూర్తి చేశాం. వైఎస్ రాజశేఖర్ రెడ్డి కుమారుడిగా ఈ ప్రాజెక్ట్‌లు పూర్తి చేసినందుకు గర్వ పడుతున్నా. నాన్నగారి హయాంలో ప్రారంభిస్తే, ఆయన మరణం తర్వాత నిర్లక్ష్యం చేశారు. గత ప్రభుత్వం సంగం బ్యారేజి కోసం రూ.30 కోట్ల 5 లక్షలు మాత్రమే ఖర్చు చేశారు. బాబు హయాంలో కమీషన్లు దండు కోవడమే వాళ్లు చేశారు. సంగం ప్రాజెక్టుకు మన ప్రభుత్వంలో రూ.200 కోట్లు ఖర్చు చేశాం. కోవిడ్ సమస్య, వరద సమస్య ఉన్న మూడేళ్లలో పూర్తి చేశాం. స్నేహితుడు మేకపాటి గౌతం రెడ్డి పేరు పెట్టాం. హఠాన్మరణంతో గౌతమ్ మనకు దూరం అయ్యాడు. సంగం బ్యారేజికి మేకపాటి గౌతం రెడ్డి పేరు పెట్టాం. గౌతం సంస్మరణ సభలో ఇచ్చిన మాట నిలబెట్టుకున్నా. 3లక్షల 85 వేల ఎకరాలు అయకటు స్థిరీకరణ జరుగుతోంది. నెల్లూరు ప్రాజెక్ట్ రూ.147 కోట్ల అంచనా వ్యయంతో ప్రారంభిస్తే.. రూ.86 కోట్లు ఖర్చు చేశారు.. ఆయన మరణం తర్వాత వాటిని పట్టించు కోలేదు. జలయజ్ఞంలో పెట్టిన 26 ప్రాజెక్ట్‌లు ప్రాధాన్యత క్రమంలో తీసుకుని ప్రతి ప్రాజెక్ట్ పూర్తి చేస్తాం" అని సీఎం జగన్ స్పష్టం చేశారు.

**ఆత్మకూరుపై వరాల వర్షం**

ఆత్మకూరు ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి ప్రతిపాదనలకు సీఎం జగన్ బహిరంగ సభ వేదికగానే ఆమోదం తెలిపారు. రూ.15 కోట్లతో హైవే నుంచి సంగం బ్యారేజి వరకు రోడ్, రూ. 40 కోట్లతో ఇరిగేషన్ పనులకు కేటాయించారు. 25 గ్రామాలకు రోడ్లు వేయడానికి రూ.14 కోట్లు మంజూరు చేశారు. రూ.12 కోట్లు స్పెషల్ గ్రాంట్‌గా కేటాయించారు. సంగం పంచాయితీకి రూ.4కోట్లు ఇచ్చారు. మొత్తంగా రూ.85 కోట్లు నిధులను అక్కడికక్కడే కేటాయిస్తున్నట్లు సీఎం జగన్ తెలిపారు.

# శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో ప్రివిలేజ్డ్ దర్శనాలు రద్దు

దర్శనాలను టీటీడీ రద్దు చేసింది. ఆర్జిత సేవలు, రూ.300 దర్శన టికెట్లతోపాటు శ్రీవాణి ట్రస్ట్ దాతలు, ఇతర ట్రస్ట్‌ల దాతలకు దర్శన టికెట్లను రద్దు చేసింది. స్వయంగా వచ్చే ప్రొటోకాల్ వీఐపీలకు మాత్రమే బ్రేక్ దర్శనం ఉంటుంది.

గదులకు సంబంధించి 50 శాతం ఆన్‌లైన్‌లో భక్తులు బుక్ చేసుకునేందుకు వీలుగా అందుబాటులో ఉంచారు. మిగిలిన గదులను ఆఫ్‌లైన్‌లో తిరుమలలోని వివిధ కౌంటర్ల ద్వారా భక్తులకు కేటాయిస్తారు. అక్టోబర్ ఒకటో తేదీన గరుడసేవ కారణంగా భక్తుల రద్దీని దృష్టిలో పెట్టుకుని ట్రస్ట్‌ల దాతలకు, కాటేజీ దాతలకు సెప్టెంబర్ 30 నుంచి అక్టోబర్ రెండో తేదీ వరకు ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో గదుల కేటాయింపును నిలిపివేయాలని టీటీడీ నిర్ణయించింది.

**శ్రీవారి దర్శనానికి 4 గంటలు**

తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. రెండు కంపార్ట్‌మెంట్లు నిండాయి. ఆదివారం అర్ధరాత్రి వరకు 71,158 మంది స్వామిని దర్శించుకోగా.. 27,968 మంది తలనీలాలు సమర్పించారు. శ్రీవారి హుండీలో కానుకల రూపంలో భక్తులు రూ.3.73 కోట్లు సమర్పించుకున్నారు. దర్శనానికి నాలుగు గంటల సమయం పడుతోంది. మరోవైపు సోమవారం శ్రీవారిని సినీనటుడు బెల్లంకొండ శ్రీనివాస్, సినీనటి మాళవిక నాయర్, హాస్య నటుడు బ్రహ్మానందం, నేషనల్ చెస్ చాంపియన్ గూకేష్ దర్శించుకున్నారు.

# ఏపీలో 8 ప్రధాన ఆలయాల్లో ఆన్‌లైన్ సేవలు..

దేవాదాయ శాఖపై సమీక్షిస్తున్నాం. దసరా ఉత్సవాలపైనా అధికారులతో మరోసారి సమీక్షించాం. వీఐపీలకు బ్రేక్ దర్శనాల కోసం ప్రత్యేక స్లాట్‌ని కేటాయిస్తున్నాం. సామాన్య భక్తులు తెల్లవారుజామున 3గంటల నుంచి రాత్రి 11 గంటల వరకు దర్శనాలకు అవకాశం కల్పిస్తాం. భక్తులెవరికీ అంతరాలయ దర్శనం ఉండదు. ఎమ్మెల్యేకి ఒక సిఫార్సు లేఖ ద్వారా ఆరుగురికి మాత్రమే రూ.500 టిక్కెట్ దర్శన భాగ్యం కల్పిస్తాం. రోజుకి 70 వేల మంది భక్తులు వస్తారని అంచనా వేస్తున్నాం. మూల నక్షత్రం రోజున రెండు లక్షల మంది భక్తులు రావచ్చు. వీఐపీల కంటే సామన్య భక్తులకే ప్రాధాన్యం ఇవ్వాలని అధికారులను ఆదేశించాం. సీసీ కెమెరాల సంఖ్యను 220 నుంచి 300లకు పెంచుతున్నాం. కేశ ఖండనశాల వద్ద 700 షవర్స్ ఏర్పాటు చేస్తున్నాం. దసరా మహోత్సవాల నిర్వహణకి ఉత్సవ కమిటీని నియమిస్తాం" అని మంత్రి సత్యనారాయణ వివరించారు.

## ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం కాకుండా తగు చర్యలు చేపట్టాలి

చేయాలన్నారు. ముఖ్యంగా గెడ్డలు, పోరంబోకు, కాలువలు అన్యాక్రాంతం కాకుండా కాపాడాలన్నారు. ప్రజలు వారి యొక్క సమస్యలతో కార్యాలయంనకు వచ్చినపుడు వారితో సహనంతో మాట్లాడి వారి యొక్క సమస్యలను తీర్చే విదంగా రెవెన్యూ అధికారులు సమన్వయంతో వ్యవహరించాలని అన్నారు. దీరకాలిక సమస్యలపై దృష్టి సారించాలని, ఒక నిర్ణయం ద్వారా అనేక మంది ప్రజలకు ఉపయోగపడే సమస్యలకు ప్రాధాన్యత ఇచ్చి పరిష్కరించేందుకు చర్యలు చేపట్టాలన్నారు. ఈ సందర్భంగా జిల్లాలో 1,40,000 ఇళ్ల స్థల పట్టాలు పంపిణీకి భూసేకరణ మరియు ఇతర పనులకు నిరంతరం శ్రమించిన అధికారులను అభినందించారు. త్వరలో ఒకేసారి సుమారు లక్ష ఇళ్ల నిర్మాణం ఒక యజ్ఞంలా ప్రారంభించి ముందుకు వెళ్లేందుకు ప్రతి ఒక్కరూ సన్నద్ధం కావాలన్నారు. ప్రతి సోమవారం నిర్వహించే స్పందన కార్యక్రమానికి అధికారులందరూ ముందుగా రావాలన్నారు.

త్వరలో ఒక మండలంను ఒక యూనిట్ గా జిల్లా కలక్టర్ తో పాటు జిల్లా అధికారులందరూ రాత్రి బస చేసి ఆ మండలంలో నున్న అన్ని కార్యాలయాలతో పాటు చేపడుతున్న ప్రభుత్వ కార్యక్రమాలను తనిఖీ చేయడం జరుగుతుందన్నారు. జిల్లా అధికారులు వారంలో మూడు రోజుల పాటు క్షేత్ర పరిశీలన చేయాలని సదరు వివరాలను కలక్టర్ కు తెలపాలన్నారు.

ఈ కార్యక్రమంలో జాయింట్ కలక్టర్ కె.యస్.విశ్వాథన్, డి.ఆర్.ఓ శ్రీనివాసమూర్తి, విశాఖపట్నం, భీమిలి ఆర్డీఓలు, తహసీల్దార్లు, డిప్యూటి తహసీల్దార్లు, తదితరులు పాల్గొన్నారు.

# కాకినాడలో ఊపిరాడక 30 మంది విద్యార్థులకు అస్వస్థత..

ఉదంతంపై విద్యా శాఖ మంత్రి బొత్స సత్యనారాయణ ఆరా తీశారు. కాకినాడ జిల్లా కలెక్టర్ కృతికా శుక్లాతో మంత్రి ఫోన్‌లో మాట్లాడారు. సంఘటనా స్థలానికి ఉన్నతాధికారులను పంపించి అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను ఆదేశించారు.

# పారిశుధ్య పనులు సక్రమంగా నిర్వహించండి

## - జివిఎంసి కమిషనర్ డాక్టర్ జి. లక్ష్మీశ



విశాఖపట్నం (విజయభాను న్యూస్) : అనకాపల్లి జోన్ పరిధిలో పారిశుధ్య పనులు సక్రమంగా నిర్వహించాలని జివిఎంసి కమిషనర్ డాక్టర్ జి. లక్ష్మీశ ప్రజారోగ్యపు అధికారులను ఆదేశించారు. మంగళవారం ఆయన క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా అనకాపల్లి జోన్ 83వ వార్డు పరిధిలోని భీమునిగుమ్మం, మల్లవీధి తదితర ప్రాంతాలలో వార్డు కార్పొరేటర్ జె. ప్రసన్న లక్ష్మితో కలసి పర్యటించారు. ఈ సందర్భంగా వార్డులో పారిశుధ్య పనులు సరిగా నిర్వహించకపోవడం పై ప్రజారోగ్యపు అధికారులపై అసహనం వ్యక్తం చేసారు. పారిశుధ్య నిర్వహణలో అలసత్వం ప్రదర్శించరాదని, వీధులలో వ్యర్థాలు అధికంగా ఉన్నాయని వాటిని వెంటనే తొలగించాలని అధికారులను ఆదేశించారు. ప్లాస్టిక్ బ్యాగులు నిషేధించినప్పటికీ ప్రతి వ్యాపారస్తుల వద్ద ప్లాస్టిక్ బ్యాగులు ఉన్నాయని, నిషేధిత ప్లాస్టిక్ కవర్లు అమ్మకుండా, వాడకుండా నిఘావుంచి ప్లాస్టిక్ కలిగివున్న వ్యాపారుల వద్ద నుండి అపరాధ రుసుం వసూలు చేయాలని ఆదేశించారు. వార్డులో చాలా చోట్ల త్రాగునీరు వృధా అవుతుందని, నీటి వృధా అరికట్టేందుకు పైపులకు వాల్వ్ బిగించాలని సంబంధిత ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. చాల చోట్ల డస్ట్ బిన్లు మరమత్తులుతో ఉన్నాయని, వాటిని వెంటనే మరమ్మత్తులు చేపట్టాలని కార్యనిర్వాహక ఇంజనీరింగ్ (మెకానికల్) వారిని ఆదేశించారు. గూడ్స్ సెంటర్ రోడ్డులో ఆక్రమణలు అధికంగా వున్నాయని, వాటిని యుద్ధ ప్రాతిపదికన తొలగించాలని పట్టణ ప్రణాళికాధికారులను ఆదేశించారు.

ఏలూరు కాలువలలో పూడికలు సరిగా తీయలేదని, గాంధీ పార్కులో విద్యుత్ పనులు మధ్యలో ఆపేసారని, దోమలు అధికంగా వున్నాయని, ఫాగింగ్ చేయించాలని స్థానికులు కమిషనర్ దృష్టికి తీసుకురాగా చర్యలు తీసుకుంటామని కమీషనర్ హామీ ఇచ్చారు. అనంతరం స్థానికంగా ఏర్పాటుచేసిన సీజనల్ వ్యాధులపై అవగాహన కార్యక్రమంలో పాల్గొని ప్రజలకు మలేరియా, డెంగ్యూ వ్యాధుల పై అవగాహన కార్యక్రమంలో పాల్గొని ప్రజలకు మలేరియా, డెంగ్యూ వ్యాధులపై అవగాహన కల్పించారు. దోమలు వృద్ధి చెందకుండా పరిసరాలు పొడిగా ఉంచుకోవాలని, టైర్లు, కొబ్బరి బొండాలు, ఖాళీ సీసాలు పరిసరాలలో ఉంచరాదని, పూల కుండీలు, మంచినీరు నిల్వలేకుండా చూడాలని, పూల కుండీలు, మంచి నీరు నిల్వలేకుండా చూడాలని, వారంలో ఒక్క రోజైనా శుక్రవారం "డ్రై" డే పాటించాలని స్థానికులకు వివరించారు. సీజనల్ వ్యాధులపై ప్రజలకు ఎప్పటికప్పుడు అవగాహన కల్పించాలని మలేరియా అధికారులను ఆదేశించారు.

# గీతం మూట్‌కోర్టు పోటీల విజేత భోపాల్ జట్టు

సాగర్‌నగర్ (విజయభాను న్యూస్) :

న్యాయ విద్యను అభ్యసించే విద్యార్థులలో విషయ పరిజ్ఞానం, వాదనా పటిమను పెంచడానికి గాను గత నాలుగురోజులుగా గీతం విశ్వవిద్యాలయం స్కూల్ ఆఫ్ లా ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జాతీయ స్థాయి మూట్‌కోర్టు పోటీలలో భోపాల్‌కు చెందిన నేషనల్ లా ఇనిస్టిట్యూట్ యూనివర్సిటీ ప్రథమ స్థానంలో నిలిచింది. గీతం వ్యవస్థాపకుడు స్వర్గీయ డాక్టర్ ఎమ్.వి.వి.ఎస్.మూర్తి పేరిట నిర్వహింస్తున్న ఈ పోటీలలో విజేతల వివరాలను గీతం స్కూల్ ఆఫ్ లా డైరక్టర్, గీతం మూట్ అండ్ అడ్వకేసే కమిటీ ఛైర్మన్ ప్రొఫెసర్ ఆర్.అనితారావు మంగళవారం తేది: 06-09-2022న ప్రకటించారు. పోటీలలో బెంగళూరుకు చెందిన క్రిస్ట్ విశ్వవిద్యాలయం ద్వితీయ స్థానంలో నిలవగా, ఉత్తమ రీసెర్చర్ అవార్డుకు నాగపూర్‌లోని సింబయాసిస్ విశ్వవిద్యాలయం విద్యార్థిని అపూర్వ పాండే ఎంపికయ్యారని, ఉత్తమ స్పీకర్‌గా నేషనల్ లా ఇనిస్టిట్యూట్ యూనివర్సిటీ (భోపాల్) విద్యార్థి దివ్యాంశ్ మొరోలియా ఎంపికయ్యారని ప్రొఫెసర్ అనితారావు తెలిపారు. మేధో హక్కులకు సంబంధించిన కేసుల పరిష్కారంపై ఈ మూట్ కోర్టు పోటీలను నిర్వహించగా ఫైనల్స్‌లో విజేతలను నిర్ణయించడానికి కలకత్తా హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ రాజశేఖర్ మంతా, మద్రాస్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సెంథిల్ రామమూర్తి న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించారని తెలిపారు. దేశంలోని దాదాపు 20 న్యాయ విశ్వవిద్యాలయాల నుంచి విద్యార్థి జట్లు పోటీలలో పాల్గొన్నాయని కన్వీనర్ తెలిపారు.

# మానవ సృజనాత్మక శక్తికి ప్రత్యామ్నాయం లేదు

## గీతంలో అమెరికా డిజైనింగ్ నిపుణుడు భానోజీ



సాగర్‌నగర్ (విజయభాను న్యూస్) : మానవ సృజనాత్మక శక్తికి ప్రత్యామ్నాయం అంటూ లేదని ముఖ్యంగా కంప్యూటర్లు, ఆటోమేషన్ వంటివి ఎప్పటికీ పోటీ కాదని అమెరికాలోని న్యూజెర్సీ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ప్రొఫెసర్, బి.డి.మెడికల్ ఫార్మా స్యూటికల్స్ సిస్టమ్స్ సీనియర్ స్టాఫ్ ఇంజనీర్ డాక్టర్ సి.త్రివిక్రమ భానోజీ రెడ్డి పేర్కొన్నారు. గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం స్కూల్ ఆఫ్ టెక్నాలజీ మెకానికల్ ఇంజనీరింగ్ విభాగం నిర్వహించిన కార్యక్రమంలో మంగళవారం తేది: 06-09-2022న ఆయన ముఖ్యఅతిథిగా హజరై ప్రసంగించారు. నూతన ఆవిష్కరణలు, అధునాతన ఉత్పత్తులను మార్కెట్‌లో పరిచయం చేయగలిగే పరిశ్రమలు మాత్రమే భవిష్యత్తులో పోటీని తట్టుకు నిలబడగలదన్నారు.

గత దశాబ్ది కాలంలో మానవ వనరులపై అధ్యయనాల ద్వారా నేటి యువతరం ఎలాంటి విషయ పరిజ్ఞానం పెంచుకోవాలి అనేది స్పష్టంగా గుర్తించారని తెలిపారు. ప్రపంచం వ్యాప్తంగా వస్తున్న మార్పులను ఆకళింపు చేసుకుని నూతన సాంకేతిక పరిజ్ఞానం పెంచుకునే యువతకు అవకాశాలు ఎక్కువగా ఉంటాయన్నారు.

ఇంజనీరింగ్ విద్యార్థులు వివిధ మార్గాలలో విషయ పరిజ్ఞానాన్ని సేకరించడం, తాము పనిచేసే సంస్థల నిర్వహణ విధానంలో పాలు పంచుకోవడం, నూతన ఆవిష్కరణల ద్వారా సంస్థ ప్రగతిలో భాగస్వామ్యులు కావడం అవసరమన్నారు. గీతం స్కూల్ ఆఫ్ టెక్నాలజీ డీన్ ప్రొఫెసర్ సి.విజయశేఖర్, మెకానికల్ ఇంజనీరింగ్ విభాగం అధిపతి ప్రొఫెసర్ వి.శ్రీనివాస్, కార్యక్రమ కో-ఆర్డినేటర్ డాక్టర్ ఎమ్.రామోహనరావు, డాక్టర్ ఆర్.భానుపవన్, డాక్టర్ ఎ.రవీంద్ర తదితరులు పాల్గొన్నారు.

## ప్రఖ్యాతి గాంచిన ఇందిరాగాంధీ మునిసిపల్ స్టేడియానికి

# సరైన వసతులు కల్పించాలి



విశాఖపట్నం (విజయభాను న్యూస్) :

విశాఖ లో ప్రఖ్యాతి గాంచిన ఇందిరాగాంధీ మునిసిపల్ స్టేడియానికి సరైన వసతులు కల్పించి స్థానిక క్రీడాకారులకు ఉపయోగపడేలా తీర్చిదిద్ద టానికి అన్ని విధాలా కృషిచేస్తున్నట్లు జీవీఎంసీ 35 వ వార్డు కార్పొరేటర్ విల్లూరి భాస్కర రావు తెలిపారు. ఈ మేరకు మంగళవారం జీవీఎంసీ కమిషనర్ డాక్టర్ లక్ష్మి షా కు వినతిపత్రం సమర్పించారు. అనంతరం విల్లూరి మాట్లాడుతూ ఇటీవల విశాఖ పర్యటనకు వచ్చిన మునిసిపల్ శాఖా మంత్రి ఆదిమూలం సురేష్ కు ఇందిరాగాంధీ మునిసిపల్ స్టేడియానికి మరమత్తులు చేపట్టి జీవీఎంసీ కు ఆదాయ వనరుగా మార్చేలా దాదాపు నూటఏభై షాపులు నిర్మించాలని కోరినట్లు తెలిపారు.సానుకూలంగా స్పందించిన మంత్రి అధికారులకు చర్యలు చేపట్టాలని ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు.జీవీఎంసీ కమిషనర్ లక్ష్మి షా తో మంగళవారం జరిగిన సమావేశంలో కోరిన విధంగా స్టేడియాన్ని ఆధునీకరించేందుకు సిద్ధంగా ఉన్నామని చెప్పారని,స్వచ్ఛదంగా నిపుణులైన ఆర్కిటెక్చర్ తో తగిన నమూనా రూపొందించాలని సూచించినట్లు తెలిపారు.ఉత్తమమైన నమూనాకు తగిన పారితోషికం చెలించేందుకు జీవీఎంసీ సిద్ధమని చెప్పినట్లు విల్లూరి తెలిపారు.

ఆసక్తి గల ఆర్కిటెక్చర్ నిపుణులు తగిన నమూనా రూపొందించాలని విల్లూరి భాస్కర రావు కోరారు.నూటఏభై షాపుల నిర్మాణంతో జీవీఎంసీ కు ఆదాయంతో పాటు నూటఏభై కుటుంబాలు ఉపాధి పొందుతాయని విల్లూరి తెలిపారు.ఆసక్తి గల ఆర్కిటెక్చర్ నిపుణులు తనను సంప్రదించాలని విజ్ఞప్తి చేసారు.

## గంజాయి రవాణాకు పాల్పడి జీవితాలను నాశనం చేసుకోవద్దు

### కొయ్యూరు ఎస్సై రాజారావు



రాజుమా విత్తనాలు పంపిణీ చేస్తున్న దృశ్యం

కొయ్యూరు (విజయభాను న్యూస్) :

గంజాయి రవాణాకు పాల్పడి జీవితాలను నాశనం చేసుకోవద్దని కొయ్యూరు ఎస్సై రాజారావు అన్నారు. మంగళవారం కొయ్యూరు మండల కేంద్రంలోని రైతు బరోసా కేంద్రంలో వ్యవసాయాదికారి కృష్ణవేణి ఆధ్వర్యంలో గిరిజన రైతులకు ఎరువులు, 90 శాతం రాజుమా విత్తనాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ గంజాయి రవాణాకు డబ్బు ఆశ చూపించి ఉపయోగించుకొని చివరకు పోలీసులకు పట్టుబడిన వెంటనే స్మగ్లర్లు జాగ్రత్తగా తప్పించుకుంటున్నారని, చివరకు జైలు పాలు అయ్యేది గిరిజన యవకులు మాత్రమేన్నారు. ఈ నేపధ్యంలో ప్రభుత్వం పోలీసు శాఖద్వారా గంజాయి రహిత ప్రాంతంగా, గిరిజనులలో పరివర్తన తెచ్చే కార్యక్రమం చేపడుతుందన్నారు. గంజాయి సాగు, రవాణాకు దూరంగా ఉండి ప్రత్యామ్నాయ పంటలు పండిస్తూ గిరిరైతులు ఆర్థికంగా ఎదగాలని ఉద్దేశంతో రాజుమా విత్తనాలు, పండ్లు మొక్కలు, అవసరమైన విత్తనాలు ఇచ్చి ప్రభుత్వం పోత్సహిస్తుందన్నారు. గిరిజనలు మంచి మార్గంలో జీవనం సాగించాలని ఎస్సై ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి బడుగురమేష్, ఎంపిటిసి, పలువురు రైతులు పాల్గొన్నారు.

## ఎలా పోరాడాలి వారికి ఎలా రక్షణ కల్పించాలి



విశాఖపట్నం (విజయభాను న్యూస్) :

ఆల్ ఇండియా హ్యూమన్ రైట్స్ ప్రొటెక్షన్ కౌన్సిల్ జాతీయ ఛైర్మన్ షేక్ సిరాజుద్ధన్ ఉత్తరాంధ్ర పర్యటనలో భాగంగా విశాఖ సిటీ లలితా నగర్, మారుతి ఆశ్రమం రోడ్డు అక్కయ్యపాలెం లో గల జాతీయ డైరెక్టర్ అన్నపూర్ణమ్మ ఆఫీస్ నందు మానవ హక్కుల అవగాహన సదస్సు జరపడం జరిగింది సదస్సులో జాతీయ డైరెక్టర్ అన్నపూర్ణమ్మ ఆంధ్ర తెలంగాణ రాష్ట్ర డైరెక్టర్ టెక్కలి శ్రీనివాసరావు ఉమెన్స్ ప్రొటెక్ట్ సెల్ చైర్మన్ కె నాగేశ్వర్ రావు ఆంధ్ర రాష్ట్ర సెక్రెటరీ సుభాని ఈశ్వరరావు ఆంధ్ర రాష్ట్ర చైల్డ్ ప్రొటెక్షన్ సెల్ చైర్మన్ కృష్ణవేణి రాష్ట్ర కార్యదర్శి కృష్ణవేణి పధ్రాన కార్యదర్శ తోట శ్రీనివాసరావు ఉత్తరాంధ్ర ప్రధాన కార్యదర్శి కామేశ్వర శర్మ ఎగ్జిక్యూటివ్ మెంబర్స్ తదితరులు పాల్గొని వారు మానవ హక్కుల గురించి ప్రతి ఒక్కరూ వారికి తెలిసిన మానవ హక్కుల విషయాల గురించి చర్చించుకోని కార్యక్రమంలో ముఖ్యంగా ఆడవారిపై జరుగుతున్న దాడుల గురించి ముసలి తల్లిదండ్రులపై జరుగుతున్న ఆస్తి వివాదాల గురించి చిన్న పిల్లలపై జరుగుతున్న లైంగిక దాడుల గురించి వారికి అండగా నిలబడి వారికి న్యాయం జరిగేంత వరకు ఎలా పోరాడాలి వారికి ఎలా రక్షణ కల్పించాలి అనే అంశంపై మాట్లాడుకోవడం జరిగింది. పజ్రలకు ఎటువంటి సమస్యలు వచ్చినా రాష్ట్ర పభ్రుత్వం పోలీస్ వ్యవస్థ కు న్యయ స్థానానికి, అనుకూలంగా మన రాజ్యాంగంలో ఏ విధంగా అయితే సమస్యలను పరిష్కరించే మార్గాలు ఉన్నాయో వాటికి కట్టుబడి ప్రజల సమస్యలు పరిష్కరించడానికి ఆల్ ఇండియా హ్యూమన్ రైట్స్ ప్రొటెక్షన్ కౌన్సిల్ సభ్యులు అందరూ కృషి చేయాలని జాతీయ ఛైర్మన్ షేక్ సిరాజుద్ధన్ చెప్పటం జరిగింది.

### మాధవధార క్రియేటివ్ యూత్ కమిటీ ఆధ్వర్యంలో

### అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించిన 50 వ వార్డు కార్పొరేటర్ వావిలపల్లి ప్రసాద్



మాధవధార (విజయభాను న్యూస్): శ్రీ వరసిద్ధి వినాయక శరన్నవరాత్రి పూజ మహోత్సవాల్లో భాగంగా మంగళవారం మాధవధార కోదండ రామాలయ వీధిలో క్రియేటివ్ యూత్ కమిటీ వారి ఆధ్వర్యంలో మహానదాన కార్యక్రమం జరిగింది .ఈ కార్యక్రమానికి 50 వ వార్డ్ కార్పొరేటర్ వావిలపల్లి ప్రసాద్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంత చక్కని కార్యక్రమాన్ని ఏర్పాటు చేసిన కమిటీ సభ్యులకు అభినందించారు.ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు మురళి, ఈశ్వరరావు, మనోజ్, విజయ్ ,వీరబాబు, తేజ, జయశంకర్ ,పవన్ సాయి, బాలకృష్ణ , కనమటి రఘు, తమ్మినేని దాలినాయుడు, మరియు కోదండ రామాలయం కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## గిరిజన యువత భవిత పేరుతో వెలసిన గోడ పత్రికలు




కొయ్యూరు (విజయభాను న్యూస్) :

కొయ్యూరు మండలం వివిధ ప్రాంతాల్లో మావోయిస్టులకు వ్యతిరేకంగా గిరిజన యువత భవిత పేరుతో గోడ పత్రికలు వెలిశాయి. ఈ గోడపత్రికల్లో పోలీస్ వారు కల్పించిన ఉచిత శిక్షణ వినియోగించుకొని ఉపాధి పొందిన గిరిజన యువత, మావోయిస్టులు చెప్పిన కల్లబొల్లి మాటలు నమ్మి ప్రాణాలు కోల్పోయిన గిరిజన యువత అంటూ పోస్టర్లులో ఉంది. అలాగే యువతీ యువకులారా, మావోయిస్టులు మాట నమ్మి మీ జీవితం నాశనం చేసుకోవద్దు అని, పోలీసు వారు కల్పిస్తున్న ఉపాధి అవకాశాలు వినియోగించుకొని మీ గ్రామాన్ని మీ కుటుంబాన్ని అభివృద్ధి పరచుకోవాలని యువతను కోరుతున్నామని వాల్‌పోస్టర్లలో పేర్కొన్నారు.

# మాకవరపాలెం ప్రభుత్వ ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశం

మాకవరపాలెం : మాకవరపాలెం ప్రభుత్వ ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశం మంగళవారం ఎంపిపి రుత్తల సత్యనారాయణ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశంలో ఆసుపత్రికి అవసరమైన మౌలిక సదుపాయాల కల్పన కోసం తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. ఆసుపత్రిలో నిర్వహించే సమావేశాలకు అదనపు గది నిర్మాణం చేసేందుకు తీర్మానించారు. అనంతరం ఎంపిపి సత్యనారాయణను వైద్యాధికారులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు డాక్టర్ శ్రీవిద్య, డాక్టర్ సీతాలక్ష్మి, ఎంపిడిఒ అరుణె, తామరం సర్పంచ్ చల్లా రత్నం తదితరులు పాల్గొన్నారు.

# సీఎం వైయస్ జగన్మోహన్ రెడ్డి తోనే గడప గడపకు సంక్షేమ పథకాలు

### ఎమ్మెల్యే యు వి రమణమూర్తి రాజు



అచ్యుతాపురం (విజయభాను న్యూస్) : ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి తోనే గడప గడపకు సంక్షేమ పథకాలు సాధ్యమని యలమంచిలి ఎమ్మెల్యే యు వి రమణమూర్తి రాజు (కన్నబాబురాజు) అన్నారు . మంగళవారం మండలంలో ఎం జగన్నాథపురం గ్రామంలో గడప గడపకు కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే ఇంటింటికి తిరుగుతూ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు గురించి ప్రజలకు తెలియజేశారు . ఈ కార్యక్రమంలో యువనేత మాజీ డిసిసిబి చైర్మన్ యు సుకుమార్ వర్మ , ఎంపీపీ కోన సంధ్య బుజ్జి , జడ్పీటిసి లాలం రాంబాబు , కో జడ్పీటిసి నర్మాల కుమార్ , మండల పార్టీ అధ్యక్షులు దేశంశెట్టి శంకరరావు , కో ఆప్షన్ ఎంపిటిసి చేపల శ్రీరాములు , అచ్యుతాపురం సర్పంచ్ విమలానాయుడు , ఎంపీటీసీ రావి నాగలక్ష్మి శోభన్ బాబు , వైసీపీ నాయకులు తోట వెంకటేష్ , కొమ్మొజు ఈశ్వరరావు ఆయా గ్రామాల సర్పంచులు , ఎంపీటీసీలు , నాయకులు , అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# విజయభాను సంపాదకీయం

## ఆయా కాలల ప్రజల అనుభవాలు

ఆయాకాలాల ప్రజల అనుభవాల, భావాల, అభి రుచుల, ఇష్టానిష్టాల, సుఖదుఃఖాల, భౌతిక ఆధ్యాత్మిక విషయాల సంపుటీకర ణమే సాహిత్యం. సాహిత్యంలో అంతర్భాగాలైన పదజాలం, సామెతలు, కవిత్వం ప్రతిదానిలోను ఏదో కొంత సాంస్కృతిక విశేషం లభించవచ్చు. కాలపరిణామంలో, ఆచార సంప్రదాయాల్లో, జీవన సరళిలో ఎన్నోరకాల మార్పు లు చోటుచేసుకోవచ్చు. కొన్ని పూర్తిగా పోవచ్చు. పాక్షికంగా మారవచ్చు. కొత్తవి ప్రారంభం కావచ్చు. వీటికి పరిసర ప్రాంతీయ భాషా సాహిత్య మత వ్యాపార సంబంధాల హేతువు కావచ్చు. దాడులు కావచ్చు. పాలకసంస్కృతి ఆచారాల అనుకరణలు కావచ్చు. సాహిత్యం సంస్కృతీపరిణామాల అవగాహనకు ఆధారభూతంగా ఎలా నిలుస్తుందో వైవిధ్యభరితమైన అంశాలు మచ్చుకు కొన్ని.. ఈ పిల్ల పదహారణాల తెలుగు అమ్మాయి. పిల్ల పదం ఏనాటిది? శాతవాహన కాలంనాటి గాథాసప్తశతిలో తొలిసారి కనిపిస్తుంది. అంతకుముందే జన వ్యవహారంలో నిత్యం వాడుకలో ఉన్న పదం. అంటే ఒక పదం వెనుక వేల ఏళ్ళ చరిత్ర ఉన్నట్లే కదా. మరి పదహారణాల తెలుగు అమ్మాయి అని ఎందుకనాలి? పదిహేడు అనవచ్చు. పద్నాలుగు అనవచ్చు, 20 అణాలు అనవచ్చు కదా! నిజాం కాలంలో ఉన్న ద్రవ్య మారకం ఇది. అణా అంటే ఆరు పైసలు. 16 అణాలు అంటే 96 పైసలు. నిజాంకాలంలో 96 పైసలే రూపాయి కింద లెక్క. బ్రిటిషాంధ్రలో నూరుపైసలకు రూపాయి. బూర్గుల రామకృష్ణారావు హైదరాబాద్ ముఖ్యమంత్రి అయినప్పుడు నిజాం రుపీ ని బ్రిటిష్ రూపాయిని సమానం చేశారు. అయితే జనంలో సెంట్ పర్సెంట్ (నూటికి నూరుశాతం) అనే దగ్గర పదహారణాలు అనే జాతీయమే వాడుకలో ఉంది. మనం 25 పైసలకు చారాణా (24 పైసలు) అనీ, 50 పైసలకు (48) ఆఠాణా, 75 పైసలకు (72) బారాణా అనీ వ్యవహారానికి వాడుతూ సర్దుకున్నాం. ఇది చరిత్రలోని ఒక పరిణామానికి సాక్ష్యం. ఈ రోజు పెళ్ళిలో మాంగల్యధారణ అన్నది ప్రధానాంశం. నిజానికి ముహూర్తం అంటే నిర్దేశిత సమయమేం కాదు. దాదాపు 40 నిమిషాలు ఉంటుంది. పురోహితులు సరిగ్గా మధ్యలో ముహూర్తం పెడతారు. మన సౌకర్యం కోసం కాస్త అటూ ఇటూ అయినా పరవాలేదు. ఆ మూహుర్తంలో కూడా జిలకర బెల్లం పెట్టడమే ముఖ్యం తప్ప మాంగల్యధారణ కాదు. జిలకరబెల్లం, సప్తపది, హోమం ఇవే పెళ్ళికి మూలం. మాంగల్యధారణ తర్వాత కాలంలో వచ్చిన దాక్షిణాత్య ఆచారం. దీని కాలం ఎప్పటిది అని తెలుసుకోవాలంటే సాహిత్యాధారం తోడ్పడుతుంది. తిక్కన.. ఉత్తరాభిమన్యుల వివాహంలో తలంబ్రాలు పోసుకోవడాన్ని వర్ణించాడే తప్ప మాంగల్యధారణ వర్ణించలేదు. పోతన భాగవతంలో..

మ్రింగెడువాడు విభుండని
మ్రింగెడిదియు గరళమనియు మేలని ప్రజకున్
మ్రింగుమనె సర్వమంగళ
మంగళ సూత్రంబు నెంతమది నమ్మినదో (భాగవతం.8-241)

అని స్పష్టంగా మాంగల్యధారణను చెప్పాడు. అంటే తిక్కన నాటికి లేకుండా పోతనకాలం నాటికి మధ్యలో ఈ ఆచారం వచ్చి స్థిరపడిందని ఊహించాలి. లలితా సహస్రనామం అందరూ పారాయణం చేస్తుంటారు. బ్రహ్మాండ పురాణం ఉత్తరభాగంలో లలితాసహస్రనామం ఉంది. అందులో కామేశబద్ధమాంగల్య సూత్రశోభిత కంధరా అని వస్తుంది. శివుడు పార్వతిమెడలో మంగళసూత్రం కట్టాడని భావం. బ్రహ్మాండ పురాణం గుప్తుల కాలంలో రాయబడిందంటారు. మరి అప్పుడు ఈ ఆచారం ఉందా? ఉన్నట్లు ఆధారాలు లేవు. ఎవరో భక్తాగ్రగణ్యుడు లలితాసహస్ర నామాన్ని బ్రహ్మాండపురాణంలో దూర్చడంలో విజయం సాధించాడు. ఇలా మధ్యలో చేర్చిన వాటిని ప్రక్షిప్తాలని పిలుస్తాం.

చేతులారంగ శివుని పూజింపడేని -
నోరునొవ్వంగ హరికీర్తి నుడవడేని
దయయు సత్యంబు లోనుగా దలపడేని
కలుగ నేటికి తల్లుల కడుపు చేటు..

అందరికీ తెలిసిన పోతన పద్యం ఇది. సాధారణంగా అర్థం చెప్పేస్తారు. కాని ఇందులో ఒక సంస్కృతీ విశేషాన్ని పోతన నిక్షిప్తం చేశాడని గమనిస్తే మరింత ఆనందం కలుగుతుంది. అభిషేకప్రియుడు శివుడు, కనుక శివాలయానికి వెళ్ళి శివుని నెత్తి మీద నీళ్లు పోయాలి. ఎందుకు గరళతాపహరణార్థం. అది చేతులారంగ చేయాల్సిందే. విష్ణువు సంకీర్తన ప్రియుడు. అందుకే విష్ణువుకు సుప్రభాతాలు, సహస్రనామాదులు ఉంటాయి. అవన్నీ నోరు నొవ్వంగ చేయాల్సిందే. చేతులారంగ శివుని పూజింపడేని.. నోరు నొవ్వంగ హరికీర్తి నుడువడేని.. అంటే అభిషేకప్రియుడు శివుడు. సంకీర్తన ప్రియుడు విష్ణువు. నమస్కారప్రియుడు సూర్యుడు. స్మరణప్రియుడు దత్తాత్రేయుడు. ఆయాదేవతల అభీష్టాల ప్రకారం పూజిస్తేనే మన అభీష్టాలు నెరవేరుతాయి.



ఊర్వశి జంక్షన్ వద్ద ఉన్న, సుభాష్ నగర్, సెంటర్ వీధిలో మంగళవారం జరిగిన అన్నసంతర్పణ కార్యక్రమం లో పశ్చిమ నియోజకవర్గం శాసనసభ్యులు గణబాబు, టిడిపి సీనియర్ నాయకులు పెంటకోట త్రినాధ్ రావు, పెంటకోట అజయ్, పెంటకోట రాజు, కార్తీక్ కుట్ట, లక్ష్మణరావు, సుభాష్ నగర్ క్రేజీ బాయ్స్, కమిటీ సభ్యులు పాల్గున్నారు.

## వై వి సుబ్బారెడ్డిని కలిసిన ఎంపీపీ దంపతులు



దేవరాపల్లి, (విజయభాను న్యూస్) : ఉమ్మడి జిల్లాల రీజనల్ కోఆర్డినేటర్ వై .వి సుబ్బారెడ్డిని విశాఖపట్నంలోని వైఎస్ఆర్ సిపి పార్టీ కార్యాలయంలో మంగళవారం మర్యాదపూర్వకంగా కలిసిన దేవరాపల్లి ఎంపీపీ కిలపర్తి రాజేశ్వరి భాస్కరరావు దంపతులు.ఈ సందర్భంగా సుబ్బారెడ్డిని సత్కరించి అభినందనలు తెలిపారు.

## అంబేద్కర్ సామాజిక భవనంనకు స్థలం



అచ్యుతాపురం (విజయభాను న్యూస్) : డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ సామాజిక భవనంనకు అచ్యుతాపురం మండలంలో ఆరు సెంట్లు స్థలం కేటాయించాలని ఎమ్మెల్యే యు వి రమణమూర్తి రాజును దళిత నాయకులు కోరారు . మంగళవారం దళిత నాయకులు ఎమ్మెల్యే యు వి రమణమూర్తి రాజును కలిశారు . దీనిపై ఎమ్మెల్యే సానుకూలం స్పందించినట్లు వారు తెలిపారు . ఎమ్మెల్యేను కలిసిన వారిలో అనకాపల్లి జిల్లా షెడ్యూల్డ్ కులాల హక్కుల పరిరక్షణ సంఘము అధ్యక్షులు తట్ట పెంటయ్య నాయుడు , మండల షెడ్యూలకులాల హక్కుల పరిరక్షణ సంఘం నాయకులు తట్ట రాజు , పూసా చిట్టిబాబు , అల్లం పల్లి అప్పారావు , తమలపాకు ఈశ్వరరావు , పెన్నాడ రమణ , ముక్కిడిపల్లి కొండబాబు , కొండలు చిన్నారావు , మట్ట అప్పలనాయుడు ,వుశ బేబీ , పూస సన్యాసిరావు , నేతల అప్పారావు , ఈరిగీల సంతోష్ కుమార్ , ఎలమంచిలి ఎస్ సి ఆర్ పి ఎస్ నాయకులు గొంప నప్పారావు ఈరిగిల చంటి , రాంబిల్లి మండల ఎస్సీ ఆర్ పిఎస్ నాయకులు గాదం కాసులు , మునగపాక మండల నాయకులు పిట్ట అప్పారావు తదితరులు పాల్గొన్నారు .

## కవి సమయం

### కోరికలు

ఆలోచనల నుండి కోరికలు ఉద్భవం
ప్రగతి సాధన పతనం అనుభవం
ఆలోచనల వలనే సాధ్యం
కోరికల వలన కర్మాచరణ
వివిధ పరిణామాల సంభవం
కోరికలకు అంతం ఎక్కడ?
సముద్రంలో అలల వలే
కోరికల నిరంతర ప్రవాహం
మానసిక చింతన, ఆందోళన
అలుపెరుగని జీవిత పోరాటం
కోరికలను జయించుట కంటే
నియంత్రణే ఉత్తమం
నిత్యజీవిత పోషణార్థం
అవసరమైన వాటికోసం ప్రయత్నం
మనస్సు పగ్గాలతో కోరికల
గుర్రాలకు కళ్లెం వేస్తూ
సంతృప్తితో నిండైన జీవితం
అత్యుత్తమం, సదా ఆచరణీయం

...కవితా రచన
సి.ప్రతాప్

## మురళి కుటుంబానికి తెలుగుదేశం పార్టీ అండగా ఉంటుంది

### మాజీ మంత్రి కిడారి శ్రావణ్ కుమార్



పాడేరు :

గడుతుల వీరయ్య సంస్మరణ దినంలో పాల్గొని కుటుంబ సభ్యులను పరామర్శించిన: మాజీ మంత్రి కిడారి శ్రావణ్ కుమార్, మాజీ ఎస్సీ ఎస్టీ కమిషన్ సభ్యులు సివేరి అబ్రహాం అరకు నియోజకవర్గం ముంచంగిపుట్టు మండలం దారెల గ్రామంలో అరకు నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ సోషల్ మీడియా ప్రతినిధి గడుతుల మురళి తండ్రి గారైన గడుతుల వీరయ్య ఇటీవల అనారోగ్యంతో బాధపడుతు మరణించిన విషయం తెలిసిందే మంగళవారం నాడు దారెల గ్రామంలో సంస్మరణ దినం సందర్భంగా అరకు నియోజకవర్గ ఇన్చార్జి మాజీ మంత్రి కిడారి శ్రావణ్ కుమార్,మాజీ ఎస్సీ ఎస్టీ కమిషన్ సభ్యులు సివేరి అబ్రహాం పాల్గొన్నారు అనంతరం వీరయ్య చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన అనంతరం మాజీ మంత్రి కిడారి శ్రావణ్ కుమార్ మాట్లాడుతూ మురళి కుటుంబానికి తెలుగుదేశం పార్టీ అండగా ఉంటుందని ఏ సమస్య ఉన్నా తమ దృష్టికి తీసుకు రావాలని కుటుంబ సభ్యులను ప్రగడా సానుభూతి సంతాపం తెలిపారు అనంతరం మాజీ ఎస్సీ ఎస్టీ కమిషన్ సభ్యులు సివేరి అబ్రహాం మాట్లాడుతూ పార్టీ అన్ని విధాలుగా అండదండగా ఉంటుందని ధైర్యంగా ఉండాలని భరోసా ఇచ్చారు మాజీ మంత్రి వెంట రాష్ట్ర ఎస్టీ సెల్ ఆర్గనైజర్ సెక్రటరీ సాగర సుబ్బారావు,అరకు పార్లమెంట్ ఆర్గనైజర్ సెక్రటరీ పాంగి శాస్త్రిబాబు, మండల జనరల్ సెక్రటరీ జగత్ రాయ్, దారెల సర్పంచ్ పాండురంగ స్వామి, ఎంపీటీసీ కొమ్మ రమ,తడిపుట్టు సర్పంచ్ సోమెలి లక్ష్మయ్య,టీడిపి మండల ఉపాధ్యక్షురాలు కీల్లో సన్యసమ్మ, వనభాసింగి సర్పంచ్ లక్ష్మణ్, అడుగులపుట్టు సర్పంచ్ నూకరాజు,టీడిపి సీనియర్ నాయకులు కిరసాని,లైకోన్,కొల్లో లైకోన్, మండి కిషోర్,నీలకంఠ పాత్రో,పెలమలా చిరంజీవి, కిముడు రామదాసు, కొచ్చొ కామరాజు,చెండ గోపాల్, అడికటియ ఈశ్వరరావు,సమరెడ్డి ఆనంద్, దేవేంద్రుడు,పుండారి, రాము,మద్దు,టైసభ్ త్రినాథ్, సూర్యాకాంతం,సాగర సత్యవతి, కిముడు మహేశ్వరీ,సల్లంగి రవికుమార్,అచ్చిబాబు,మాజీ సర్పంచ్ పల్టసింగి కామేశ్వరరావు, టీడిపి నాయకులు రాజారావు, పెలమల రామలింగం,నాగేంద్ర, బత్తిరి రామరావు,నరంజి ప్రసాద్ టీడీపీ నాయకులు కార్యకర్తలు అభిమానులు మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# ధరఖాస్తుదారులను వేధిస్తే సహించేది లేదు

### - మ్యుటేషన్ల దరఖాస్తులు కారణం లేకుండా తిరస్కరిస్తే చర్యలులి -జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్



పాడేరు : మ్యుటేషన్ దరఖాస్తుదారులను వేదిస్తూ పదే పదే తిప్పటం సరికాదని, అంతే కాకుండా విఆర్ఓ లాగిన్ లో రిజెక్ట్ చేయటం జరుగుతోందని, అటువంటి సందర్భాలలో ఆయా తహసిలదార్లపై చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హెచ్చరించారు. మంగళవారం కలక్టరేట్ విసి హాల్ నుండి మండల స్థాయి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించిన కలెక్టర్ మాట్లాడుతూ, మ్యుటేషన్ దరఖాస్తుదారులకు కుటుంబ సభ్యుల ధృవీకరణ, నోటరీ అఫిడివిట్ లేకుండా సిసిఎల్ఎ సూచనల ప్రకారం మ్యుటేషన్ చేయాలని ఆదేశాలు జారీ చేసినప్పటికీ కొంతమంది తహసిల్దార్లు పట్టించుకోటం లేనందున చాలా దరఖాస్తులు పెండింగ్ లో ఉన్నాయన్నారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ అభిషేక్ ను వారితో సమీక్షించి మ్యుటేషన్లు త్వరగా పూర్తీ చేయాలని ఆదేశించారు. 11 మండలాలు తిరిగి విఆర్ఓల పని తీరుపై అసంతృప్తి వ్యక్త పరిచిన సబ్ కలెక్టర్ 15 మంది విఆర్ఓలకు నోటీసులు జారీ చేసామని సబ్ కలెక్టర్ తెలిపారు.

సచివాలయాలలో పెన్షన్ దరఖాస్తులు పెండింగ్ ఉండటంపై కూడా కలెక్టర్ అసంతృప్తి వ్యక్త పరుస్తూ సకాలంలో పరిష్కార చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. 22 పెన్షన్ దరఖాస్తులు పెండింగ్ లో ఉన్న కొయ్యూరు తహసిల్దార్ గూర్చి ఆరా తీయగా తనకి డిజిటల్ సైన్ కాలేదని తెలిసుకుని, జాయినై నెల దాటినా డిజిటల్ సైన్ లేకుండా ఎం చేస్తున్నారని, మరుసటి వారం విసి నాటికి డిజిటల్ సైన్ తీసుకోకపోతే వివరణ ఇవ్వాల్సి ఉంటుందని హెచ్చరించారు. అదేవిదంగా సచివాలయ సిబ్బందిని తరచూ సమీక్షించాలని, సచివాలయ సిబ్బంది యునిఫారం ధరించేలా చర్యలు తీసుకోవాలని ఎంపిడిఒ లను ఆదేశించారు. ప్రతి సచివాలయంకు గడప గడపకు మాన ప్రభుత్వం కింద రూ.20 లక్షలు మంజూరు అయినందున సంబంధిత శాశన సభ్యులుతో చర్చించి ఆయా సచివాలయాల పరిధిలో చేపట్టాల్సిన పనులను అప్లోడ్ చేయాలని, సాంకేతిక, పరిపాలనాపరమైన మంజూరులు పొందాలని కలెక్టర్ ఆదేశించారు.ఈ విడియో కాన్ఫరెన్స్ లో జిల్లా నుండి డిఆర్ఓ బి. దయానిధి, మండలాల నుండి, ఇటిడిఎ ప్రోజేక్ట్ అధికారులు రోణంకి గోపాల కృష్ణ, సూరజ్ గనోరే, తహసిల్దార్లు, ఏమ్పిడిఓ లు తదితరులు పాల్గొన్నారు.

## మనది ఏ జిల్లా... ?

### జిల్లాలు మారిన నేమ్ బోర్డుపై పేరు మారలేదు




అచ్యుతాపురం (విజయభాను న్యూస్) : జిల్లాలు మారిన ప్రభుత్వ కార్యాలయాల నేమ్ బోర్డు పై జిల్లా పేరు మారలేదు . పరిపాలన సౌలభ్యం కోసం రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం కొత్తగా 13 జిల్లాల ఏర్పాటు చేశారు . కొత్తగా ఏర్పాటైన జిల్లాల్లో అనకాపల్లి జిల్లా కూడా ఉంది. గతంలో అచ్యుతాపురం మండలం విశాఖ జిల్లాలో ఉండేది , ఇప్పుడు అనకాపల్లి జిల్లాలో కలిసింది . జిల్లాల ఏర్పడి నాలుగు నెలలు కావస్తున్న నేటికీ కొన్ని ప్రభుత్వ కార్యాలయాల నేమ్ బోర్డు పై జిల్లా పేరు మారలేదు . ఎంతోమంది ఉన్నత అధికారులు వచ్చి వెళ్తూ ఉంటారు అయినా నేమ్ బోర్డుపై దృష్టి పెట్టలేదు . వివిధ పనుల మీద వచ్చే ప్రజలు నేమ్ బోర్డును చూసి అయోమయానికి గురవుతున్నారు . ఇంతకు అచ్యుతాపురం మండలం విశాఖ జిల్లా లేదా అనకాపల్లి జిల్లా మారితే ఎందుకు పేరు మార్చలేదు అని ప్రజలు చర్చించుకుంటున్నారు .

# ఐ.ఎం.యు. తృతీయ బి.టెక్. విద్యార్థుల చైతన్య కార్యక్రమాలు అభినందనీయం



ములగాడ (విజయభాను న్యూస్): ఐ.ఎం.యు. విశాఖపట్నం క్యాంపస్ తృతీయ బి.టెక్. విద్యార్థుల చైతన్య కార్యక్రమాలు మిక్కిలి అభినందనీయమని జాతీయ సేవా పథకం జిల్లా ప్రోగ్రామ్ అధికారి ఇ.పి.ఎస్. భాగ్యలక్ష్మి అన్నారు. స్థానిక ఐ.ఎం.యు. క్యాంపస్ లో సెమిస్టర్ సేవా కార్యక్రమాల ముగింపు సమావేశంలో ఆమె మాట్లాడుతూ- విద్యార్థులు నిర్వహించిన ఆజాది కా అమృత మహోత్సవ్ కార్యక్రమాలు, ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు నిర్వహించిన పోటీలు, ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా ఉపాధ్యాయులను సన్మానించడం, సమకాలీన సామాజిక కార్యకర్తలపై, ప్రభుత్వ పాలనా సిద్ధాంతాలపై నిర్వహించిన సెమినార్లు యువజన సమస్యలపై ఏర్పాటు చేసిన బృంద చర్చలు మరియు ఉపన్యాస పోటీలు ఎంతో శ్లాఘనీయం అని అన్నారు. వివిధ పోటీలలో విజేతలకు బహుమతులను అందించారు. విద్యార్థులు జీవితాంతం సేవా కార్యక్రమాలను కొనసాగించాలని అన్నారు. సమావేశానికి వంశీ, చైతన్య తదితరులు నాయకత్వం వహించారు. ఈ కార్యక్రమాలను విజయవంతంగా పూర్తి చేసినందుకు విద్యార్థులను క్యాంపస్ డైరెక్టర్ ఆచార్య కేశవదేవ్ మరియు విభాగాధిపతి డాక్టర్ శ్రీజ, అధ్యాపకులు అభినందించారు.

# బాణాసంచా గోదాములో పేలుడుబీనలుగురికి తీవ్ర గాయాలు

సబ్బవరం : మండలంలోని ఆరిపాక పంచాయతీ శివార చినయాతపాలెం సమీపంలో ఒక రహస్య స్థావరం లో అక్రమంగా బాణాసంచా తయారీ కేంద్రంలో మంగళవారం అగ్ని ప్రమాదం సంభవించి అందులో పనిచేస్తున్న నలుగురు కార్మికులకు తీవ్ర గాయాలయ్యాయి . స్థానికులు కథనం ప్రకారం విశాఖ జిల్లా కంచరపాలెం కి చెందిన ఇద్దరు వ్యక్తులు ఇతర ప్రాంతాలకు చెందిన మరో ఇద్దరు వ్యక్తులు పని చేస్తున్నారు అయితే గోదాంలో బాణసంచా తయారు చేస్తూ ఉండగా అకస్మాత్తుగా మంటలు చెలరేగడంతో గోదాము దగ్ధమైంది. ఈ సంఘటనలో ఒక మహిళ మరో ముగ్గురు యువకులు మంటల్లో చిక్కుకొని తీవ్రంగా గాయపడ్డారు, గాయపడిన వీరిని కొంతమందిని చికిత్స నిమిత్తం విశాఖ కేజీహెచ్కు తరలించారు మరి కొంతమందిని అనకాపల్లి ఎన్టీఆర్ హాస్పటల్ కు తరలించారు. సంఘటనా స్థలానికి స్థానిక ఎస్ఐ ఎల్ సురేష్, అగ్నిమాపక సిబ్బంది చేరుకున్నారు



క్షతగాత్రులను వైద్యం నిమిత్తం ఆస్పత్రికి తరలించడంతో కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

# ఆశా వర్కర్లకు కనీస వేతనాలు 26 వేలు ఇవ్వాలి



అనంతగిరి, విజయభాను, న్యూస్, అనంతగిరి.. ఆశా వర్కర్లకు కనీస వేతనాలు 26 వేలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ పినకోట పిహెచ్ సిలో సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా.

ఈ సందర్భంగా సిఐటియు మండల కార్యదర్శి కిల్లో మోస్య మాట్లాడుతూ పెరిగిన ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచాలని ఆయన డిమాండ్ చేశారు నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశానికి అంటుతుందని కాని కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయడం లేదని విమర్శించారు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి వెంటనే కనీస వేతనాలు 26 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు ఈ నెల 20న చలో పాడేరు కార్యక్రమం జయప్రదం చేయాలని కోరారు ఈకార్యక్రమంలో ఆశావర్కర్లు సిహెచ్ డబ్ల్యు లు వెంకటలక్ష్మి మల్లమ్మ సిఐటియు నాయకులు భీమరాజు కొండబాబు తదితరులు పాల్గొన్నారు .

# ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు




విశాఖపట్నం (విజయభాను న్యూస్) :

ఉపాధ్యాయ దినోత్సవం పురస్కరించుకొని ఈరోజు ఆంధ్రప్రదేశ్ ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లా అధ్యక్షులు బివి మురళీ మనోహర్ అధ్యక్షతన డాబా గార్డెన్స్ దగ్గర గల అల్లూరి సీతారామరాజు భవన్ ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రాష్ట్ర ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్ చైర్మన్ కే ఎస్ ఎన్ మూర్తి గారు అసిస్టెంట్ ఎగ్జామినేషన్ కమిషనర్ దానయ్య గారు డీఈఓ ఆఫీస్ సూపరిండెంట్ కొణతాలు జగన్నాథం గారు జిల్లా గౌరవ అధ్యక్షులు మణికుమార్ గారు జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ గారు అదనపు ప్రధాన కార్యదర్శి కొణతాల శ్రీనివాస్ గారు కోశాధికారి సిహెచ్ మూర్తి గారు పాల్గొన్నారు ముందుగా సర్వేపల్లి రాధాకృష్ణ గారి చిత్రపటానికే పూలమాలవేసి ఘన నివాళులర్పించడం జరిగింది వక్తలు అందరూ ఉపాధ్యాయ వృత్తిలో ఉన్న ఆనందాన్ని భావి భారత పౌరులు తీర్చిదిద్దే అవకాశం తమకు వచ్చినందుకు ఇది పూర్వజన్మ సుకృతవని కొని ఆడారు ఈ సందర్భంగా కొంతమంది సీనియర్ ఉపాధ్యాయులకు సత్కరించుకోవడం జరిగింది ఈ యొక్క కార్యక్రమంలో వివిధ నియోజకవర్గ అధ్యక్షులు జిల్లా కమిటీ సభ్యులు వివిధ పాఠశాల ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు పాల్గొనడం జరిగింది.



*యానాం శివారు కనకాలపేట రామాలయం వద్ద కొలువైన ఉన్న శ్రీ వరసిద్ధి వినాయకుడికి 100 కేజీల లడ్డూను ప్రముఖ వ్యాపారవేత్త మచ్చ శ్రీను మంగళవారం నైవేద్యంగా సమర్పించి పూజలు నిర్వహించారు. శ్రీ వరసిద్ధి వినాయక ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో అర్చకులు కోన బట్ల శ్రీరామచంద్రమూర్తి పర్యవేక్షణలో జరిగిన ఈ పూజా కార్యక్రమంలో ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్వామివారిని దర్శించి పూజలు చేశారు. గ్రామస్తులు, స్థానిక నాయకులు, ఉత్సవ కమిటీ ప్రతినిధులు ఎమ్మెల్యేని శాలువాలతో ఘనంగా సత్కరించారు. ముందుగా గ్రామ దేవత దుర్గమ్మ తల్లి ఆలయం వద్ద నుండి ఊరేగింపుగా లడ్డును తీసుకువచ్చి స్వామివారికి సమర్పించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు కోన కొండబాబు, కాటంశెట్టి రామ్మూర్తి, కవల కోటేశ్వరరావు, కోన సూరిబాబు, కోన, రామచంద్ర రావు కోన సుబ్బా రావు, కోన జయరాజు, కవల బాబులు, పోలిశెట్టి రాంబాబు, కోన గన్నయ్య, కోన నరసింహమూర్తి,శ్రీ వరసిద్ధి వినాయక ఉత్సవ కమిటీ ప్రతినిధులు, గ్రామస్తులు పాల్గొన్నారు.*

# చిలకపేటలో ఉచిత వైద్య శిబిరం కు విశేష స్పందన..

## *శిబిరాన్ని ప్రారంభించిన విశాలాంధ్ర బ్యూరో చీఫ్ రామకృష్ణ..*



విశాఖపట్నం (విజయభాను న్యూస్): సామాజిక సేవ లక్ష్యంగా 39 వ వార్డు చిలకపేట ఏరియా లో సీ. కె. పి. లోకల్ బాయ్స్ ఆధ్వర్యంలో (అల్ మదద్ హెల్పింగ్ హాండ్స్ వెల్ఫేర్ సొసైటీ) సపోర్ట్ తో ఓమ్ని ఆర్కే హాస్పిటల్ సహాయంతో మంగళవారం ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ వైద్య శిబిరాన్ని విశాలాంధ్ర ఉమ్మడి విశాఖపట్నం జిల్లా బ్యూరో చీఫ్ రిపోర్టర్ పి. రామకృష్ణ ప్రారంభించారు. ఈ మెడికల్ క్యాంపుకు పరిసర ప్రాంతాల నుంచి అనేకమంది ప్రజలు తరలివచ్చారు. సి కె పీ లోకల్ బాయ్స్ ఆధ్వర్యంలో వివిధ సామాజిక కార్యక్రమాలు చేపడుతున్నారు. దీనికి విశేష స్పందన లభించింది. ఈ ఉచిత వైద్యసేవలను సుమారు 200 మంది వైద్య సేవలను అందుకున్నారు. ఇందులో భాగంగా చిన్నపిల్లలకు , పెద్దలకు పలు వ్యాధినిర్ధాన పరీక్షలను చేసి తగు ఆరోగ్య సలహాలను అందించారు. నగరంలో భయపెడుతున్న వైరల్ , విషపుజ్వరాలు, జీవన శైలిలో మార్పులను పరిగణించుకొని "అందరికి ఆరోగ్యం గొప్ప జీవన శైలిని " అందించాలనే లక్ష్యంతో ఈ తరహా వైద్య పరీక్షలను ప్రజలకు ఓమ్ని ఆర్కే (గిగిల్స్ ) తల్లి పిల్లల ఆసుపత్రి గత కొన్ని నెలలలుగా వేర్వేరు ప్రదేశాలల్లో నిర్వహిస్తున్నట్లు ఆసుపత్రి సిబ్బంది తెలియజేశారు. ఈ కార్యక్రమం లో ముఖ్య అతిథిగా పాల్గొన్న విశాలాంధ్ర బ్యూరో చీఫ్ రిపోర్టర్ పి.రామకృష్ణ , 39 వ వార్డు కార్పొరేటర్ మహమ్మద్ సాదిక్, అంగన్వాడి టీచర్. ఎం సత్య, సి. కే. పి లోకల్ బోయ్స్ రవి, నవీన్, నూకరాజు, నవీన్, సంజయ్, వంశీ, రాజేష్, దుర్గాప్రసాద్ , ప్రేమ్ మరియు వెల్ఫేర్ సొసైటీ సభ్యులు, హరీష్, ఆసుపత్రి వైద్య సిబ్బంది గౌరీనాయుడు. కృష్ణ వేణి పాల్గొన్నారు.

# 48వ వార్డులో నూతన విద్యుత్ దీపాల ఏర్పాటుపై స్పందించిన గంకల కవిత అప్పారావు

**- అంగన్వాడీ కేంద్రంలో పౌష్టికాహారం పంపిణిలో పాల్గొని, గ్రామస్తులు ఇండ్లలోనే భోజనం చేసిన గంకల**



కంచరపాలెం(విజయభాను న్యూస్) :ఉత్తర నియోజకవర్గం 48వ వార్డులో నూతన విద్యుత్ దీపాల ఏర్పాటుపై 48వ వార్డ్ కార్పొరేటర్,జీవీఎంసీ బీజేపీ ఫ్లోర్ లీడర్ గంకల కవిత అప్పారావు మంగళవారం నాడు స్పందించి నూతన విద్యుత్ దీపాలను ఏర్పాటు చేసారు.ఈ సందర్భంగా గ్రామంలో నెలకొన్న వీధి దీపాలు,విద్యుత్ దీపాల మరమ్మతులు గ్రామస్తుల సమక్షంలో జవహర్ లాల్ నెహ్రూ నగర్,మహాత్మా గాంధీ నగర్,ఏ ఎస్ ఆర్ నగర్,ఇందిరానగర్-3,4,5 ప్రాంతాలలో ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు.అందులో భాగంగా వార్డులో గల అంగన్వాడీ కేంద్రంలో గంకల చేతులు మీదుగా పౌష్టికాహారం పంపిణి చేసారు.ఈ సందర్భంగా గుడ్ మార్నింగ్ గంకల కార్యక్రమంలో నూతన వీధి దీపాలు ఏర్పాటు చేయమని పిర్యాదు పై వార్డులో విద్యుత్ వీధి దీపాల ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు.వార్డ్ అంతటా ఎలక్ట్రికల్ సమస్య లేకుండా రోజుకొక ప్రాంతంలో సమస్య లేకుండా చూసేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు.నిరీక్షణ కాలంగా వీధి దీపాలు ఏర్పాటు సమస్య పరిష్కారం చేయమని ఫిర్యాదు అందిందని తక్షణమే సంబంధిత అధికారులతో సంప్రదించి పనులు చేపట్టడం,జరిగిందని తెలిపారు.మరి కొన్ని రోజులలో కొండ వాలు ప్రాంతంలో నూతన విద్యుత్ స్తంబాలు కూడ ఏర్పాటు కు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.ఇందులో భాగంగా మధ్యాహ్న విరామం సమయంలో గ్రామస్తులు ఇండ్లలోనే భోజనం చేసి విరామం లేకుండా గంకల కవిత అప్పారావు నూతన విద్యుత్ దీపాలు ఏర్పాటుకై చేస్తున్న కృషి పట్ల గ్రామస్తులు మంత్ర ముగ్ధులైయ్యారు.వార్డులో కొండవాలు ప్రాంతంలో రాత్రి పూట పాములు, విష పురుగులు సంచరించడం జరుగుతుందని అటువంటి సమయంలో వీధి దీపాలు లేనందు వలన ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని కావున వీధి దీపాలు ఏర్పాటు చేయమని సంబంధిత అధికారులతో చర్చించి సమస్య పరిష్కారం చేయడం జరుగుతుందని తెలిపారు.వార్డ్ అభివృద్ధి విషయంలో వార్డులో ప్రతిరోజు పర్యటన చేస్తూ ప్రజా సమస్యలు తెలుసుకుంటున్న గంకల కవిత అప్పారావు తీరు పట్ల ప్రజలు హర్షాతిరేకాలు అందించారు.

# వరసిద్ధి వినాయకున్ని దర్శించుకున్న వైసీపీ నేతలు కేకే రాజు, బర్కత్ అలీ



విశాఖపట్నం(విజయభాను న్యూస్) : సిరి షెల్టర్స్ ప్రయివేట్ లిమిటెడ్ వారి ఆధ్వర్యంలో మర్రిపాలెం జాతీయ రహదారి గ్రీన్ గార్డెన్స్ వద్ద నున్న సంస్థ కార్యాలయం ఎదుట ఏర్పాటు చేసిన వర సిద్ధి వినాయకుని పూజా మండపాన్ని వైసీపీ ఉత్తర నియెజక వర్గం ఇన్చార్జి కె.కె.రాజు,స్థానిక కార్పొరేటర్ బర్కత్ అలి ,ఇతర నాయకులు సందర్శించి స్వామి వారికి విశేష పూజలు చేశారు .

ఈ సందర్భంగా సిరి షెల్టర్స్ ఎండి పి.దుర్గా కృష్ణ ప్రసాద్.., వారిని శాలువాతో సత్కరించారు.సంస్థ డైరెక్టర్ ప్రసాదుల బాబూరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో మధ్యాహ్నం భక్తులకు అన్న సమారాధన చేపట్టారు. వరసిద్ధి వినాయకుని సప్తమ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా బుధవారం సాయంత్రం స్వామి వారి విగ్రహం ఊరేగింపు అనంతరం అనుపు మహోత్సవం నిర్వహిస్తారు.

# క్రేందీయ విద్యాలయం ఘటనపై సమగ్ర విచారణ చేసి చర్యలు తీసుకోవాలి

కాకినాడ : కాకినాడ రూరల్ వలసపాకల లో కేంద్రీయ విద్యాలయం ఘటనలో అవస్థకు గురైన విద్యార్థులను కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రిలో పరామర్శించిన SFI బృందం. ఈ సందర్భంగా SFI రాష్ట్ర కార్యదర్శి A. అశోక్ మాట్లాడుతూ కేంద్రీయ విద్యాలయం లో 6,7 తరగతులకు చెందిన 18 మంది విద్యార్థులు అవస్థకు గురికావడం గల కారణాలు ఉన్నత స్థాయి అధికారులు సమగ్రమైన విచారణ చేయాలనీ, తరుచు కాకినాడ లో వలసపాకలు ఏరియాలో ప్రారిశ్రామిక పాంత్రంలో ఇటువంటి ఘటనలు జరుగుతున్నాయి అన్నారు. అటువంటి కోణంలో కూడా ఉన్నత స్థాయి అధికారులు విచారణ చేయాలని, విద్యార్థులకు మెరుగైన వైద్యం అందించాలనీ ఈ ఘటన కు కారణం అయినా వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.ఘటన పై కలెక్టర్ గారు విచారణ కమిటీ వేయడం మంచి పరిణామం అనీ,ఈ కమిటీ రిపోర్ట్ 24గంటలో వచ్చిన తరువాత వెంటనే చర్యలు తీసుకోవాలని, గతంలో జరిగిన ఘటనలో కూడా కమిటీ వేసిన రిపోర్ట్ నేటికీ రాకుండా కాలయాపన చేశారు అనీ,ఆ విధంగా ఈ ఘటనపై కాలయాపన చేయకుండా రిపోర్ట్ వచ్చిన తరువాత ఘటనకు కారణం అయినా వారి పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో ఎస్.ఎఫ్.ఐ జిల్లా అద్యక్ష, కార్యదర్శి లు జి.రాము,టి.రాజా జిల్లా నాయకులు ఎం.గంగా సూరిబాబు,టి.మణికంఠ సాయి, భాస్కర్, పి.వరహాలు, మదన్,ఆర్. రవి, డి.విశ్వ, ఆర్.అరుణ్ తదితరులు పాల్గొన్నారు.

## *కేంద్రీయ విద్యాలయ సంఘటన*
## *ప్రత్యేక విచారణ కమిటీతో కలెక్టర్ డా. కృతికా శుక్లా సమావేశం*

కాకినాడ : కాకినాడ లో కేంద్రీయ విద్యాలయంలో విద్యార్థులు అస్వస్థతకు గురైన సంఘటనపై ఏర్పాటు చేసిన ప్రత్యేక విచారణ కమిటీ సభ్యులతో జిల్లా కలెక్టర్ డా. కృతికా శుక్లా మంగళవారం సాయంత్రం కలెక్టరేట్లో సమావేశం నిర్వహించారు. సోమవారం ఉదయం నుంచి మంగళవారం సంఘటన జరిగిన సమయం వరకు పాఠశాల కార్యకలాపాలను ప్రిన్సిపల్ బి.శేఖర్ను అడిగి తెలుసుకున్నారు. తరగతి గదుల్లో మౌలిక వసతులు, పరిసరాల వాతావరణం, విద్యార్థులు పాల్గొన్న పాఠ్య, సహ పాఠ్య కార్యక్రమాలు, తాగునీటి వ్యవస్థ తదితరాల వివరాలు అడిగి తెలుసుకున్నారు. సంఘటన చోటుచేసుకోవడానికి కారణాన్ని కచ్చితంగా తెలుసుకోవడం ద్వారా భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు జరక్కుండా చూసుకోవచ్చన్నారు. విద్యార్థుల రక్త నమూనాలు, తాగునీటి నమూనాలను ల్యాబ్లకు పంపినందున.. నివేదికలు వస్తే కారణాలను అన్వేషించేందుకు వీలవుతుందన్నారు. అదే విధంగా మైక్రో బయాలజీ నిపుణులను పాఠశాలకు పంపి పరిశీలన చేయించాలని అధికారులకు సూచించారు. ప్రస్తుతం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థుల ఆరోగ్య పరిస్థితిని జీజీహెచ్ వైద్యులు డా. ఎంఎస్ రాజు వివరించారు. పాఠశాలలో పూర్తిస్థాయిలో పారిశుద్ధ్య కార్యక్రమాన్ని చేపట్టాలని కేంద్రీయ విద్యాలయ ప్రిన్సిపల్కు సూచించారు. సంఘటనపై పూర్తిస్థాయిలో విచారణ చేసి ఆయా విభాగాల పరిశీలనల నివేదికలను సమర్పించాలని కలెక్టర్ ఆదేశించారు.

# పక్షవాతాన్ని ఓడించండి!



పక్షవాతం పెద్ద సమస్య. చెట్టంత మనిషిని ఉన్నట్టుండి నిట్ట నిలువునా కూల్చేస్తుంది. చేవలుడిగేలా చేస్తుంది. తీవ్రమైతే ప్రాణాంతకంగానూ పరిణమిస్తుంది. ప్రపంచవ్యాప్తంగా సంభవిస్తున్న మరణాలకు రెండో అతిపెద్ద కారణం పక్షవాతమే. దీన్నుంచి కోలుకున్నా ఎంతోమంది వైకల్యంతో బాధపడటం తెలిసిందే. సరిగా మాట్లాడలేకపోవటం, ఆలోచించలేకపోవటం, ఉద్యోగం కోల్పోవటం, ఆదాయం తగ్గిపోవటం, నలుగురితో కలవలేకపోవటం వంటి ఇబ్బందులూ ఎదుర్కొంటుంటారు. ఇలా ఇది ఆర్థికంగానూ దెబ్బతీస్తుంది. పక్షవాతం ఎవరికైనా, ఎప్పుడైనా, ఎక్కడైనా రావొచ్చు. మెదడు రక్త నాళాల్లో గడ్డలు ఏర్పడటం, రక్తనాళం చిట్లిపోయి మెదడులో రక్తస్రావం జరగటం.. ఇలా రెండు రకాలుగా పక్షవాతం రావొచ్చు. ఏ కారణంతో రక్త సరఫరా ఆగిపోయినా మెదడుకు తగినంత ఆక్సిజన్ అందదు. ఆ భాగం దెబ్బతింటుంది. చచ్చుబడిపోతుంది. మంచి విషయం ఏంటంటే- దాదాపు అన్నిరకాల పక్షవాతాలను నివారించుకునే అవకాశముండటం. వయసు, కుటుంబంలో ఎవరైనా పక్షవాతానికి గురవటం, మగ ఆడ బేధాల వంటివి మన చేతుల్లో లేకపోవచ్చు. కానీ పక్షవాతానికి దారితీసే చాలా ముప్పు కారకాలను కచ్చితంగా నియంత్రించుకోవచ్చు. పక్షవాతం బారినపడకుండా కాపాడుకోవచ్చు. అలాంటి కొన్ని ముప్పు కారకాల గురించి తెలుసుకొని, అవగాహన పెంచుకోవటం మంచిది.

**అధిక రక్తపోటు**

పక్షవాతానికి అధిక రక్తపోటు ప్రధాన కారణం. నియంత్రించుకోగదగిన ముప్పు కారకాల్లోనూ అతి ముఖ్యమైనది ఇదే. దీని మూలంగానే సగానికి పైగా మంది పక్షవాతం బారినపడుతున్నారు. అధిక రక్తపోటు మూలంగా రక్తనాళాలు దెబ్బతింటాయి. దీంతో తేలికగా రక్తనాళాలు చిట్లుతుంటాయి. రక్తం గడ్డలు ఏర్పడుతుంటాయి. అధిక రక్తపోటు వల్ల కొందరికి మెదడులో రక్తనాళాలు బలహీనపడి రక్తస్రావం జరగొచ్చు. ఇవన్నీ పక్షవాతం ముప్పును పెంచేవే. కాబట్టి రక్తపోటు 120/80 కన్నా మించకుండా చూసుకోవాలి. అంతకన్నా తక్కువున్నా మంచిదే.

**పొగ అలవాటు**

సిగరెట్లు, బీడీలు, చుట్టల వంటి వాటిల్లోని నికొటిన్, కార్బన్ మోనాక్సైడ్ గుండె రక్తనాళాల వ్యవస్థను దెబ్బతీస్తాయి. పక్షవాతానికి బీజం వేస్తాయి. పొగ అలవాటుకు గర్భనిరోధక మాత్రలు కూడా తోడైతే పక్షవాతం ముప్పు ఇంకాస్త ఎక్కువవుతుంది.

**మధుమేహం**

పక్షవాతం బాధితుల్లో ప్రతి ఐదు మందిలో ఒకరు మధుమేహులే. మిగతావారితో పోలిస్తే మధుమేహంతో బాధపడేవారు పక్షవాతం నుంచి కోలుకోవటమూ కష్టమే. దీర్ఘకాలంగా రక్తంలో గ్లూకోజు స్థాయులు ఎక్కువగా ఉంటుంటే రక్తనాళాలు దెబ్బతింటాయి. అంతేకాదు, మధుమేహంతో బాధపడే చాలామందిలో రక్తపోటు, రక్తంలో కొలెస్ట్రాల్ మోతాదులూ ఎక్కువగానే ఉంటాయి. బరువు కూడా ఎక్కువే. ఇవన్నీ పక్షవాతం ముప్పును పెంచేవే. కాబట్టి రక్తంలో గ్లూకోజు నియంత్రణలో ఉండేలా చూసుకోవటం ఎంతైనా అవసరం.

**ఆహారం**

గది ఉష్ణోగ్రతలో చిక్కబడే కొవ్వులు, నూనెలు (సంతృప్త కొవ్వులు), వనస్పతి వంటి ట్రాన్స్ ఫ్యాట్స్ రక్తంలో కొలెస్ట్రాల్ స్థాయులు పెరిగేలా చేస్తాయి. ఉప్పు ఎక్కువగా ఉండే పదార్థాలతోనూ రక్తపోటు పెరుగుతుంది. ఎక్కువ కేలరీలనిచ్చే ఆహారం ఊబకాయానికి దారితీస్తుంది. కాబట్టి ఇలాంటి కొవ్వులు, ఉప్పు, పిండి పదార్థాల విషయంలో జాగ్రత్త అవసరం. శాకాహారం ఎక్కువగా తీసుకోవాలి. రోజుకు ఐదు, అంతకన్నా ఎక్కువసార్లు కూరగాయలు, పండ్లు తినటం మంచిది. ఇది పక్షవాతం నివారణకు తోడ్పడుతుంది.

**వ్యాయామం**

శారీరక శ్రమ, వ్యాయామంతో పక్షవాతం ముప్పు తగ్గుతుంది. అంతేకాదు, పక్షవాతానికి దారితీసే గుండెజబ్బు, ఊబకాయం/అధిక బరువు, అధిక రక్తపోటు, అధిక కొలెస్ట్రాల్, మధుమేహం ముప్పులూ తగ్గుముఖం పడతాయి. రోజుకు కనీసం అరగంట సేపు వ్యాయామం చేసినా పక్షవాతం ముప్పు 25% మేరకు తగ్గుతుంది. వ్యాయామం చేయటానికి సమయం దొరకటం లేదని భావిస్తే ఎక్కువసేపు ఒకేదగ్గర కూర్చోకుండానైనా చూసుకోవాలి.

**ఊబకాయం**

ప్రతి 5 పక్షవాతం కేసుల్లో ఒకరు ఊబకాయం మూలంగానే దీని బారినపడుతున్నారు. అధిక బరువుతో 22% మేరకు, ఊబకాయంతో 64% మేరకు పక్షవాతం ముప్పు పెరుగుతుండటం గమనార్హం. ఎందుకంటే అధిక బరువు, ఊబకాయంతో రక్తపోటు, మధుమేహం, గుండెజబ్బులు ముంచుకొచ్చే ప్రమాదముంది. ఇవన్నీ పక్షవాతానికి దారితీసేవే. కాబట్టి బరువు ఎక్కువుంటే వెంటనే తగ్గించుకోవటం ముఖ్యం. కనీసం 5 కిలోల బరువు తగ్గినా గణనీయమైన ప్రభావం కనిపిస్తుంది.

**అధిక కొలెస్ట్రాల్**

చాలావరకు కొలెస్ట్రాల్ కాలేయంలో తయారవుతుంది. ఇది లైపోప్రొటీన్ల ద్వారా రక్తంలో కలిసి ప్రవహిస్తుంటుంది. లైపోప్రొటీన్లు రెండు రకాలు. 1. లో డెన్సిటీ లైపోప్రొటీన్ (ఎల్‌డీఎల్). దీన్నే మనం చెడ్డ కొలెస్ట్రాల్‌గా భావిస్తాం. 2. హై డెన్సిటీ లైపోప్రొటీన్ (హెచ్‌డీఎల్). ఇది మంచి కొలెస్ట్రాల్. చెడ్డ కొలెస్ట్రాల్ స్థాయులు మితిమీరితే రక్తనాళాల లోపల పూడికలకు దారితీస్తుంది. దీంతో పక్షవాతం ముప్పు పెరుగుతుంది. మాంసం, కొవ్వులు తక్కువగా తినటం.. వ్యాయామం చేయటం వంటి జీవనశైలి మార్పులు.. అవసరమైతే మందులు వాడుకోవటం ద్వారా కొలెస్ట్రాల్‌ను తగ్గించుకోవచ్చు.

**రక్తనాళ సమస్యలు**

కొందరికి మెడ వద్ద ధమనిలో పూడికలు ఏర్పడుతుంటాయి (కెరొటిడ్ ఆర్టరీ డిసీజ్). దీంతో రక్తనాళం లోపలి మార్గం సన్నబడి, మెదడుకు రక్త సరఫరా తగ్గుతుంది. పూడికలు రక్తనాళం గోడల నుంచి విడిపోయి రక్తం గడ్డ కట్టొచ్చు. ఇది పక్షవాతానికి దారితీస్తుంది. కొందరికి కాళ్లు, చేతుల నుంచి గుండెకు రక్తాన్ని తీసుకొచ్చే రక్తనాళాల్లోనూ పూడికలు ఏర్పడొచ్చు. ఇవి గలవారికీ కెరొటిడ్ ఆర్టరీ తలెత్తే ముప్పు పెరుగుతుంది.

**గుండె లయ తప్పటం**

గుండె అస్తవ్యస్తంగా కొట్టుకునే సమస్యతో (ఏట్రియల్ ఫిబ్రిలేషన్) బాధపడేవారికి పక్షవాతం వచ్చే అవకాశం ఐదు రెట్లు ఎక్కువ. ఎందుకంటే గుండె పైగదులు సరిగా పనిచేయకపోతే రక్తం నిల్వ ఉండిపోయి, రక్తం గడ్డలు ఏర్పడతాయి. ఇవి మెదడుకు చేరుకొని పక్షవాతానికి దారితీయొచ్చు. అందువల్ల ఏట్రియల్ ఫిబ్రిలేషన్ గలవారు మరింత జాగ్రత్తగా ఉండాలి. నిద్రలో శ్వాసకు అడ్డంకి తలెత్తటానికీ (స్లీప్ అప్నియా) గుండె లయ అస్తవ్యస్తం కావటానికీ దగ్గరి సంబంధముంది. ఇవి రెండూ కలిస్తే అగ్నికి ఆజ్యం పోసినట్టే.

**కుంగుబాటు, ఒత్తిడి**

ప్రతి 6 పక్షవాతం కేసుల్లో ఒకటి మానసిక సమస్యలతో ముడిపడినవే. వీటిల్లో ప్రధానంగా చెప్పుకోవాల్సింది కుంగుబాటు, ఒత్తిడి గురించే. వీటితో పక్షవాతం, స్వల్ప పక్షవాతం (టీఐఏ) తలెత్తే ప్రమాదం రెండు రెట్లు ఎక్కువ. ముఖ్యంగా మధ్యవయసు, వృద్ధుల్లో ఇలాంటివి ఎక్కువగా కనిపిస్తుంటాయి. కాబట్టి మానసిక సమస్యలను నిర్లక్ష్యం చేయొద్దు. కుంగుబాటు, ఒత్తిడి లక్షణాలు కనిపిస్తే వెంటనే సైకియాట్రిస్టును సంప్రదించాలి. అవసరమైతే తగు చికిత్స తీసుకోవాలి.

## ప్రజల్లో తగ్గుతోన్న కరోనా 'యాంటీ బాడీస్'




ప్రాణాంతక కరోనా వైరస్ బారిన పడిన వారు ప్రాణాలతో బయట పడాలంటే వైరస్‌ను సమర్థంగా ఎదుర్కొనే 'యాంటీ బాడీస్ (రోగ నిరోధక శక్తి)' శరీరంలో పెంచుకోవడం ఒక్కటే మార్గమని ప్రపంచవ్యాప్తంగా ప్రసిద్ధి చెందిన శాస్త్రవేత్తలు మొదటి నుంచి చెబుతున్న విషయం తెల్సిందే. ఎందుకంటే కరోనా చికిత్సకు సరైన మందు ఇంతవరకు లేకపోవడమే. రోగ నిరోధక శక్తిని పెంచే వ్యాక్సిన్లు కూడా ఇంకా అందుబాటులోకి రాకపోవడంతో సహజ సిద్ధంగా అంటే ఆరోగ్యకరమై ఆహారంతోపాటు శారీరక వ్యాయామం చేయడం మరో మార్గమని కూడా వైద్యులు సూచిస్తూ వస్తున్నారు. కొందరిలో సహజ సిద్ధంగానే రోగ నిరోధక శక్తి ఉంటుంది. అయితే ఈ రోగ నిరోధక శక్తి బ్రిటీష్ ప్రజల్లో క్రమంగా తగ్గుతూ వస్తోందని తాజాగా నిర్వహించిన పరీక్షల్లో తేటతెల్లం అవడం ఆందోళనకరమైన విషయం. కరోనా వైరస్ బారిన పడుతున్న వారి సంఖ్య రోజు రోజుకు పెరగుతున్న నేపథ్యంలో రోగ నిరోధక శక్తి కూడా ప్రజల్లో అదే శాతంలో లేదా అంతకన్నా ఎక్కువ మందిలో పెరగుతూ రావాలి. కానీ అందుకు విరుద్ధంగా తగ్గడం బ్రిటీష్ శాస్త్రవేత్తలకు అంతుపట్టకుండా ఉంది. కరోనా వైరస్‌ను ఎదుర్కొనే యాంటీ బాడీస్‌కు సంబంధించి గత జూన్ నెలలో నిర్వహించిన పరీక్షల్లో బ్రిటన్ జనాభాలో ఆరు శాతం జనాభాలో యాంటీ బాడీస్ ఉన్నట్లు తేలింది. సెప్టెంబర్ నెల నాటికి యాంటీ బాడీస్ కలిగిన వారి సంఖ్య 4.4 శాతానికి పడిపోయిందని తేలింది. దేశంలోని మొత్తం జనాభాకుగాను దేశ నలుమూలల నుంచి 3,65,000 మంది శాంపిళ్లను సేకరించడం ద్వారా 'రియాక్ట్ 2' పేరిట పరిశోధకులు జరిపిన అధ్యయనంలో వెల్లడయింది. ప్రజల్లో యాంటీ బాడీస్ తగ్గిపోవడం అంటే వారిలో కరోనా వైరస్‌ను ఎదుర్కొనే శక్తి తగ్గిపోవడం కనుక ప్రజలు ఈ విషయంలో ఆందోళన చెందడం సహజమే.

కొన్ని సందర్భాంలో ప్రజల్లో యాంటీ బాడీస్ పడి పోవడం కూడా సాధారణమేనని, మెమోరీ సెల్స్‌గా పిలిచే బీ సెల్స్ పడి పోకూడదని, తాము జరిపిన పరిశోధనల్లో బీ సెల్స్ పడిపోయాయా లేదా అన్న అంశాన్ని పరిశోధించలేదని, ఈ కారణంగా యాండీ బాడీస్ పడి పోవడం పట్ల అంతగా ఆందోళన చెందాల్సిన అవసరం లేదని పరిశోధకులు భరోసా ఇస్తున్నారు.

వ్యాక్సిన్ల వల్ల కూడా యాండీ బాడీస్ పెరగుతాయని వారు చెప్పారు.

## ఈ లక్షణాలు మీకుంటే మీరు మేధావే..!



మేధావి అనే మాట వినగానే ముఖం అలా వెలిగిపోతుంది. ఓ మేధావి గురించి మాట్లాడినా, చెప్పినా, లేదా అతడిని చూసినా ఓ రకమైన సంతోషం కలుగుతుంది. ఇంతకీ మేధావి అంటే ఎవరు? అసలు అతడికి ఎలాంటి లక్షణాలు ఉంటాయి? మేధావి గురించే మాట్లాడుకునే వారిలో మేధావి లక్షణాలు లేవా.. మేధావి కావాలంటే ఎలాంటి లక్షణాలు ఉండాలి అనే అంశంపై బ్రిటన్‌కు చెందిన ఓ అధ్యయనం కొన్ని వివరాలు వెల్లడించింది. ముఖ్యంగా ఈ ఐదు లక్షణాలు ఉంటే మాత్రం మేధావేనట. ఆ లక్షణాలేమిటో ఒకసారి పరిశీలిస్తే..

**1. ప్రతి విషయం గురించి అమితమైన ఆసక్తి**

ఒకే అంశానికి పరిమితం కాకుండా నిరంతరం భిన్న విషయాలను పఠించి వాటిని నేర్చుకోవడం మేధావి లక్షణం. జీనియస్‌లంతా ఇలాగే చేస్తారట.

**2.మీలో మీరు మాట్లాడుకోవడం**

సాధారణంగా కొంతమంది వ్యక్తులు తమలో తాము మాట్లాడుకుంటుంటారు. అప్పుడప్పుడు ఆ మాటలు బయటకు కూడా వినిపిస్తాయి. వారిని చూసి కొంతమంది నవ్వుకుంటారు కూడా. అయితే, అలా మాట్లాడుకునేవారు అస్సలు సిగ్గుపడొద్దట. ఎందుకంటే మేధావులు అలాగే చేస్తారని అధ్యయనం చెబుతోంది.

**3.పుస్తకాల పురుగు**

సాధారణంగా ఎవరైతే నిత్యం పుస్తకాల్లో మునిగి ఉంటారో వారంతా జీనియస్ అంట. వారు పిచ్చిపట్టిన వారిలా పుస్తకాలు చదువుతూ కనిపిస్తారట.


**4.కష్టాలతో ఎంజాయ్**

మేధావులు కష్టాలను సవాలుగా తీసుకుని, వాటిని సొంత తెలివితేటలతో పరిష్కరించుకొని ఆనందంగా గడిపేస్తారంట.

**5.తప్పులు క్షమించి మర్చిపోగలిగే తీరు**

సాధారణంగా మేధావులు తప్పు చేసిన వారిని క్షమిస్తారట. అసలు ఆ విషయాలను అంతపెద్దగా పట్టించుకోరంట. ఒక వేళ ఎవరైనా ఆ తప్పులను గుర్తు చేస్తే ఎప్పుడు? అవునా అంటూ జీనియస్‌లు ప్రతిస్పందిస్తారంట.

# ఇంటి వైద్యానికి జై!



కొవిడ్-19 కొత్త పాఠాలు నేర్పింది. వైద్యం తీరుతెన్నులను గణనీయంగా మార్చేసింది. అత్యవసరమైతే తప్ప ఆసుపత్రులకు వెళ్లలేని పరిస్థితి నెలకొన్న నేపథ్యంలో టెలీ మెడిసిన్‌కు ఎనలేని ప్రాధాన్యం పెరిగింది. ఫోన్, వాట్సాప్, వెబ్‌సైట్ల ద్వారానే డాక్టర్లను సంప్రదించటం పెరిగిపోయింది. ఇలాంటి సమయంలో మన గురించి డాక్టర్లకు కచ్చితమైన సమాచారం అందించేదెలా? ఈ విషయంలో క్లినిక్‌లలో తరచూ వాడే కొన్ని పరికరాలను ఇంట్లో ఉంచుకోవటం ఎంతగానో మేలు చేస్తుంది. డాక్టర్లు అడిగే విషయాల గురించి వెంటనే వివరించటానికి.. సమస్య మామూలుదా? అత్యవసరమైందా? అనేది తేల్చుకోవటానికిది ఉపయోగపడుతుంది.

**థర్మామీటర్:** ప్రస్తుతం డాక్టర్లంతా ముందుగా అడిగేది జ్వరం గురించే. దీన్ని తెలుసుకోవటానికి థర్మామీటరు తప్పనిసరి. కాబట్టి ఇంట్లో పాదరస రహిత థర్మామీటర్ (డిజిటల్ థర్మామీటర్) ఉంచుకోవటం మంచిది. దీన్ని ఉపయోగించటం తేలిక. శరీర ఉష్ణోగ్రతను బట్టి డాక్టర్లు రకరకాల జబ్బులను అంచనా వేస్తారు. ఈ రోజుల్లో జ్వరం 100 డిగ్రీల సెల్షియస్ కన్నా తక్కువుంటే కొవిడ్‌గా, 101 కన్నా ఎక్కువుంటే ఇతరత్రా వైరల్ ఇన్‌ఫెక్షన్లుగా భావించొచ్చు. జ్వరం దశ దశలుగా ఎక్కువవుతూ వస్తుంటే టైఫాయిడ్‌గా, సాయంత్రం పూట జ్వరం వస్తుంటే క్షయగా, ఉష్ణోగ్రత 104 కన్నా ఎక్కువుంటే మలేరియాగా.. ఇలా ఒక అంచనాకు రావటానికి వీలుంటుంది.

**బరువు యంత్రం:** నాణ్యమైన బరువు తూచే పరికరం కూడా ముఖ్యమే. స్ప్రింగుతో కూడిన దాని కన్నా ఎలక్ట్రానిక్ పరికరమైతే మేలు. దీంతో ఎప్పటికప్పుడు బరువు పెరగటం, తగ్గటం తెలుసుకోవచ్చు. గుండె, కిడ్నీ, కాలేయ సమస్యలు గలవారిలో ఒంట్లో నీరు నిల్వ ఉండిపోతుంటుంది. ఇది బరువులో ప్రతిఫలిస్తుంది. దీని ద్వారా మందులు పనిచేస్తున్నాయా? మోతాదు పెంచాల్సి ఉంటుందా? అనేవి తెలుసుకోవచ్చు.

**గ్లూకోమీటరు:** ఇటీవలి కాలంలో ఇది ఇంటింటి పరికరంగా మారిపోయింది. భోజనానికి ముందూ తర్వాతా రక్తంలో గ్లూకోజు మోతాదులు తెలుసుకోవటాకిది ఎంతగానో తోడ్పడుతుంది. ఇన్సులిన్ తీసుకునేవారు ఎప్పటికప్పుడు గ్లూకోజు మోతాదులు తెలుసుకోవటానికి, గ్లూకోజు మోతాదు బాగా పడిపోయిందనే అనుమానం వచ్చినప్పుడు వెంటనే పరీక్షించుకోవటానికి ఉపయోగపడుతుంది. ఇలా ఎవరికివారు ఇన్సులిన్ మోతాదు మార్చుకోవచ్చు. లేదూ డాక్టర్‌ను సంప్రదించి సలహా తీసుకోవచ్చు. కొవిడ్ దుష్ప్రభావాలకూ మధుమేహానికీ ప్రత్యక్ష సంబంధం ఉంటున్న తరుణంలో గ్లూకోమీటరు ఇంట్లో ఉండటం తప్పనిసరి అవుతోంది.

**రక్తపోటు పరికరం:** జబ్బులు ఏవైనా డాక్టర్లు విధిగా రక్తపోటు పరీక్షిస్తుంటారు. ఆసుపత్రులకు వెళ్లలేని ప్రస్తుత పరిస్థితుల్లో ఇంట్లో ఒక బీపీ పరికరం ఉంచుకోవటం ఎంతైనా మంచిది. ఇప్పుడు పాదరస రహిత, స్టెతస్కోప్ అవసరం లేని ఎలక్ట్రానిక్ బీపీ పరికరాలు బాగానే అందుబాటులో ఉన్నాయి. వీటితో ఇంట్లోనే రక్తపోటును తేలికగా పరీక్షించుకోవచ్చు. దీన్ని బట్టి రక్తపోటు తీరుతెన్నులను తెలుసుకోవచ్చు. అవసరమైతే డాక్టర్లు మందుల మోతాదు పెంచటం, తగ్గించటం చేస్తారు.

**పీక్ ఫ్లో మీటర్:** ఊపిరితిత్తుల సామర్థ్యాన్ని తెలిపే పరికరమిది. గట్టిగా శ్వాస తీసుకొని ఒక్కసారిగా ఇందులోకి గాలిని ఊదాల్సి ఉంటుంది. దీంతో అత్యధిక నిశ్వాస ప్రవాహ వేగం బయటపడుతుంది. ఆస్థమా వంటి ఊపిరితిత్తుల సమస్యలు, గుండె సమస్యలు గలవారికిది బాగా ఉపయోగపడుతుంది. మందుల మోతాదు పెంచినా నిశ్వాస వేగం పెరగకపోతే ఆసుపత్రికి వెళ్లాల్సి ఉంటుంది. ఇలా అత్యవసర పరిస్థితిని ముందుగానే పసిగట్టటానికి వీలుంటుంది.

**చిన్న టార్చిలైటు:** నోట్లో నాలుక, అంగిలి, కొండ నాలుక వరకు అన్ని భాగాలను దీంతో స్పష్టంగా చూడొచ్చు. ఆన్‌లైన్ ద్వారా డాక్టరుకు చూపించొచ్చు. రక్తహీనతలో నాలుక పాలిపోతుంది. తీవ్ర బ్యాక్టీరియా ఇన్‌ఫెక్షన్లలో నోరంతా ఎర్రగా అయిపోతుంది. ఇలా రకరకాల జబ్బులను తెలుసుకోవటాకిది ఉపయోగపడుతుంది.

**భూతద్దం:** చర్మ సమస్యలను, చర్మం మీద తలెత్తే మార్పులను స్పష్టంగా గుర్తించటానికిది అవసరం. చర్మం మీద మచ్చల రంగు, వాటి అంచులు, అంచుల మీది బొడిపెల ఆధారంగా బ్యాక్టీరియా, ఫంగస్ ఇన్‌ఫెక్షన్లను గుర్తించొచ్చు. పైకి కనిపించకుండా ఉండిపోయే ఇతరత్రా జబ్బులనూ చర్మం మీద తలెత్తే మార్పులతో పసిగట్టొచ్చు. భూతద్దంతో డాక్టర్‌కు చూపించటం కష్టమనుకుంటే ఫోన్ ద్వారా ఫోటో తీసి, పెద్దదిగా చేసి పంపొచ్చు.

**స్టెతస్కోప్:** డాక్టర్ అనగానే గుర్తొచ్చేది ఇదే. దీంతో గుండె ఎలా కొట్టుకుంటోంది? శ్వాస తీసుకుంటున్నప్పుడు ఎలాంటి చప్పుడు వస్తోంది? అనేది తెలుసుకోవచ్చు. గుండె లయలో తేడాలు గుర్తిస్తే వెంటనే డాక్టర్ల దృష్టికి తీసుకురావొచ్చు. స్టెతస్కోప్‌తో వృద్ధుల్లో వినికిడి లోపాన్నీ తెలుసుకోవచ్చు. స్టెతస్కోప్ చెవులకు తగిలించినా చప్పుడును గుర్తించలేకపోతే వినికిడి లోపం ఉందనే అనుకోవచ్చు.

**కొలత టేపు:** ఇది దాదాపు అందరి ఇళ్లలోనూ ఉండేదే. దీంతో ఎత్తును కొలుచుకొని, ఎత్తుకు తగిన బరువు ఉన్నారో లేదో తెలుసుకోవచ్చు. తుంటి, నడుం చుట్టుకొలతల మధ్య నిష్పత్తిని లెక్కించటానికీ అవసరమవుతుంది. గుండె, కిడ్నీ, కాలేయ సమస్యలు గలవారు తరచూ నడుం చుట్టు కొలతను చూసుకోవాల్సి ఉంటుంది. దీని ద్వారా డాక్టర్లు ఒంట్లో నీరు నిల్వ ఉండిపోతుండటాన్ని అంచనా వేస్తారు. శ్వాస సమస్యలు గలవారు ఊపిరి తీసుకున్నప్పుడు ఛాతీ విస్తరించే కొలతను బట్టి ఊపిరితిత్తుల సామర్థ్యాన్నీ అంచనా వేస్తారు.

**పల్స్ ఆక్సీమీటర్:** కొవిడ్ విజృంభణతో ఉన్నట్టుండిది అత్యవసర పరికరంగా మారిపోయింది. దీంతో రక్తంలో ఆక్సిజన్ మోతాదులతో పాటు గుండె వేగమూ తెలుస్తుంది. ఆక్సిజన్ 95 కన్నా తగ్గటం ప్రమాదకరం. ఇలాంటివారు ఆయాసం లేకపోయినా ఆసుపత్రిలో చేరటం అత్యవసరం. ఇలాంటి విపత్కర పరిస్థితులను ఎప్పటికప్పుడు పసిగట్టటానికి పల్స్ ఆక్సీమీటర్ తోడ్పడుతుంది. ఆక్సిజన్ 95 కన్నా ఎక్కువుంటే ఇంట్లోనే ఉండి చికిత్స తీసుకోవచ్చు. అలాగే ఆరు నిమిషాల సేపు నడిచిన తర్వాత రక్తంలో ఆక్సిజన్ మోతాదులు పడిపోతుంటే కూడా అప్రమత్తం కావొచ్చు. ఇలా అత్యవసర పరిస్థితిని తెలుసుకోవటానికి వీలుండటం వల్ల దీంతో ఒక రకమైన ధైర్యం కూడా వస్తోంది. ఆస్థమా, సీవోపీడీ, ఎంఫెసీమా వంటి శ్వాస సమస్యలు.. అలాగే గుండె జబ్బులు గలవారికీ ఉపయోగపడుతుంది.

# ప్లాస్టిక్ రహిత విశాఖకు సింగర్ మల్లికార్జున సహకారం

## - జీవిఎంసి కమిషనర్ డాక్టర్ జి. లక్ష్మీశ







విశాఖపట్నం (విజయభాను న్యూస్) : విశాఖ వాస్తవ్యులైన సినీ నేపధ్య గాయకులు మల్లికార్జున విశాఖ అభివృద్ధికి సహకరిస్తూ స్వచ్ఛ విశాఖ అనే పాటను సంగీత స్వరకల్పన చేసి జివిఎంసి కి అందించి నందుకు కమిషనర్ పత్యేక అభినందనలు తెలిపారు. మంగళవారం విశాఖ నగారానికి విచ్చేసిన మల్లికార్జునను కమిషనర్ ఆయన ఛాంబర్లో మర్యాద పూర్వకంగా కలిసారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ విశాఖ వాస్తవ్యులు, విశాఖ నగార అభివృద్ధికి సహకరిస్తున్నందుకు అభినందనీయమని, ప్లాస్టిక్ వస్తువులను నిషేధించి 3 మాసాలు పూర్తి అవుతందని ఆయనకు వివరించారు. ప్లాస్టిక్ నిర్మూలనలో విశాఖ నగర ప్రజల సహకారం మరవలేని దన్నారు. నగరంలో ప్లాస్టిక్ వస్తువులను వినియోగించకుండా ప్రత్యామ్నాయ వస్తువుల బాట పట్టడం సంతోషదాయకమన్నారు. ప్రముఖ సినీ నేపధ్యగాయకులైన మల్లికార్జున మన విశాఖ వాస్తవ్యులు అవ్వడం, నగరాన్ని అభివృద్ధి కొరకు మీ వంతు సహకారం అందించాలన్నారు. ఈ సందర్భంగా కమిషనర్ మల్లికార్జున కు దుస్సాలువాతో జ్ఞాపికను అందించారు.

అనంతరం సినీ నేపధ్య గాయకుడు మాల్లికార్జున మాట్లాడుతూ విశాఖ నగరంలో పుట్టి, విద్యను ఇక్కడే అభ్యసించానని, విశాఖ నగరం ఎప్పుడు వచ్చినా అభివృద్ధి చెందుతూ రూపు రేఖలు మారుతున్నాయని, నేను పుట్టిన విశాఖ నగరానికి స్వచ్ఛ విశాఖ అనే పేరుతొ పాట పాడేందుకు అవకాసం ఇచ్చినందుకు కమిషనర్ కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ప్లాస్టిక్ విడనాడి ప్రత్యామ్నాయ వస్తువులే వాడాలని విశాఖ నగరంలో పర్యావరణ హితమైన వస్తువులు విరివిగా లభిస్తున్నాయని, పూర్వం ప్లాస్టిక్ లేనప్పుడు ప్రత్యామ్నాయ వస్తువులే వాడేవారని ప్రజలకు సందేశాన్ని ఇచ్చారు. నా సేవలు ఎప్పుడూ ఈ విశాఖ నగరనికి అందించడానికి సిద్ధంగా వున్నానని తెలిపారు. అనంతరం నగర మేయర్ ను మర్యాదపూర్వకంగా కలసి ప్లాస్టిక్ నిర్మూలనకు కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ ఎస్ ఎస్ వర్మ, తదితరులు పాల్గొన్నారు.

# గీతం ఆధ్వర్యంలో గర్భిణిలకు పోషకాహార కిట్ల పంపిణీ



సాగర్‌నగర్ (విజయభాను న్యూస్) : పోషకాహార వారోత్సవాలలో భాగంగా గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం మహిళా సాధికారిక విభాగం (గీతం విమెన్ ఎంపర్‌మెంట్ సెల్) ఆధ్వర్యంలో స్థానిక పెదజాలరిపేట లోని పట్టణ ఆరోగ్య కేంద్రంలో మంగళవారం తేది: 06-09-2022న ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. గీతం అధ్యక్షుడు ఎమ్.శ్రీభరత్, స్థానిక శాసనసభ సభ్యుడు వెలగపూడి రామకృష్ణబాబు గర్భిణి స్త్రీలకు పోషకాహర కిట్‌లను పంపిణి చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పోషకాహరం లోపం వల్ల పుట్టే పిల్లలలో శారీరక లోపాలు తలెత్తుతాయన్నారు. బాలలకు, మహిళలకు పోషకాహరం తగినంత ఇవ్వడం ద్వారా దేశ విద్యా, ఆర్థిక, ఆరోగ్య రంగాలలో ప్రమాణాలు పెరుగుతాయన్నారు. కార్యక్రమంలో ప్రో-వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ వై.గౌతమ్‌రావు, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ డి.గుణశేఖరన్, గీతం మహిళాసాధికారిక విభాగం ఛైర్ పర్సన్ డాక్టర్ సురేఖ చల్లా,కన్వీనర్ డాక్టర్ స్వాతి చిక్కాల, ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ ఎమ్.వి.వి. మురళీమోహన్, జిమ్‌సర్ ఆస్పత్రి గైనకాలజీ విభాగం వైద్య నిపుణులు డాక్టర్ రాధ పాల్గొన్నారు. ఈ సందర్భంగా పోషకాహర లోపాల వల్ల కలిగే ఆరోగ్య సమస్యలను పోషకాహర నిపుణురాలు పి.మానసలక్ష్మి వివరించారు. విటమిన్‌లు, సూక్ష్మపోషకాలు అధికంగా ఉండే తాజాపండ్లు, కూరగాయలతో పాటు చిరుధాన్యాలతో చేసిన మాల్ట్‌లను తీసుకోవడం ద్వారా పోషకాహర లోపాలను అధిగమించవచ్చునని తెలిపారు. సరైన పోషకాలు లభిస్తే బాలలలో మహిళలలో అనారోగ్యాలకు అడ్డుకట్ట వేయవచ్చునన్నారు. స్థానిక నాయకులు, పట్టణ ఆరోగ్య కేంద్రం వైద్యులు, అంగన్‌వాడి సిబ్బంది పాల్గొన్నారు.

# సీఐడీ కేసులో మాజీ మంత్రి నారాయణకు ముందస్తు బెయిల్



అమరావతి: రాజధాని బృహత్‌ప్రణాళిక, ఇన్నర్ రింగ్‌రోడ్డు అలైన్‌మెంట్‌లో అక్రమాలు జరిగాయన్న ఆరోపణలపై సీఐడీ నమోదు చేసిన కేసులో మాజీ మంత్రి నారాయణకు ముందస్తు బెయిల్ మంజూరైంది. ఆయనతో పాటు రామకృష్ణ హౌసింగ్ సొసైటీ డైరెక్టర్ అంజనీకుమార్, వ్యాపారవేత్త లింగమనేని రమేశ్‌కు కూడా హైకోర్టు ముందస్తు బెయిల్‌కు అనుమతించింది. అమరావతి మాస్టర్ ప్లాన్‌లో అక్రమాలు జరిగాయంటూ మంగళగిరి ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి ఫిర్యాదు మేరకు సీఐడీ పోలీసులు కేసులు నమోదు చేసిన విషయం తెలిసిందే. దీంతో ముందస్తు బెయిల్ కోసం మాజీ మంత్రి నారాయణ, లింగమనేని రమేశ్, అంజనీకుమార్ హైకోర్టులో పిటిషనర్ వేసుకోగా.. విచారణ జరిపిన ఉన్నత న్యాయస్థానం గతంలో తీర్పును రిజర్వు చేసింది. అయితే, తాజాగా వీరికి ముందస్తు బెయిల్ మంజూరు చేస్తూ హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. అమరావతిలో ఇన్నర్ రింగ్ రోడ్ మంజూరు కానప్పుడు అవినీతి జరగటానికి ఎలా ఆస్కారం ఉంటుందని పిటిషనర్‌తరఫు న్యాయవాది వాదించారు. రాజకీయ దురుద్దేశంతోనే పిటిషనర్లపై కేసులు పెట్టారని.. ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని కోరారు. దీంతో తాజాగా వారికి ముందస్తు బెయిల్ మంజూరు చేస్తూ ఉన్నత న్యాయస్థానం ఉత్తర్వులు జారీచేసింది. తీర్పు వెలువరించింది.

# అనుమతుల్లేకపోతే వాటి కూల్చివేతకు ఆదేశాలిస్తాం : ఏపీ హైకోర్టు


## రుషికొండ రిసార్ట్ పునరుద్ధరణ పనులపై హైకోర్టు ధర్మాసనం

అమరావతి: విశాఖపట్నం రుషికొండ రిసార్ట్ పునరుద్ధరణలో భాగంగా చేపడుతున్న నిర్మాణాలకు అనుమతులు లేవని తేలితే వాటి కూల్చివేతకు ఆదేశాలు జారీ చేస్తామని హైకోర్టు స్పష్టం చేసింది. తదుపరి విచారణను ఈ నెల 22కి వాయిదా వేసింది. ఈ మేరకు ప్రధాన న్యాయమూర్తి (సీజే) జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రా, న్యాయమూర్తి జస్టిస్ డీవీఎస్ఎస్ సోమయాజులు ధర్మాసనం ఉత్తర్వులు జారీ చేసింది. విశాఖ జిల్లా యండాడ గ్రామం సర్వే నంబర్ 19 కోస్టల్ రెగ్యులేషన్ జోన్‌లో చెట్ల నరికివేత, భూమి తవ్వకాలకు అనుమతులివ్వడం కేంద్ర పర్యావరణ, అటవీ శాఖ గతంలో ఇచ్చిన అనుమతులకు, విశాఖపట్నం పట్టణ ప్రాంతాభివృద్ధి సంస్థ మాస్టర్ ప్లాన్‌కు విరుద్ధమంటూ జనసేన కార్పొరేటర్ మూర్తి యాదవ్, విశాఖ తూర్పు ఎమ్మెల్యే రామకృష్ణ దాఖలు చేసిన వ్యాజ్యాలను సీజే ధర్మాసనం మరోసారి విచారించింది.

మూర్తి యాదవ్ తరఫున సీనియర్ న్యాయవాది కేఎస్ మూర్తి వాదనలు వినిపిస్తూ, అనుమతులు లేకుండానే నిర్మాణాలు చేపడుతున్నారని, అందువల్ల ఈ వ్యాజ్యాలపై త్వరగా విచారణ చేపట్టాలని కోరారు. ధర్మాసనం స్పందిస్తూ.. గతంలో తామిచ్చిన ఆదేశాలకు భిన్నంగా వ్యవహరించినా ఆ నిర్మాణాల కూల్చివేతకు ఆదేశాలు జారీ చేస్తామని చెప్పింది.

# శ్రీవారిని దర్శించుకున్న అయోధ్య హనుమాన్ దేవాలయ పీఠాధిపతి కళ్యాణ్ దాస్ మహారాజ్ స్వామీజీ, పరమ వీర చక్ర అవార్డ్ గ్రహీత యోగింద్ర సింగ్ యాదవ్

## - స్వాగతం పలికిన శాసనమండలి సభ్యులు వంశీకృష్ణ యాదవ్



తిరుమల / తిరుపతి (విజయభాను న్యూస్): దేశంలో ఎంతో ప్రతిష్టాత్మకమైన, చారిత్రాత్మకమైన అయోధ్య హనుమాన్ దేవాలయ పీఠాధిపతి అయోధ్య హనుమంతుని సేవలో నిత్యం అన్నదానం చేస్తూ గొప్ప సేవ భావం కలిగి ప్రపంచంలో అనేకమంది ప్రముఖులతో నిత్యం బిజీ గా వుండే స్వామీజీ బాబా కళ్యాణ్ దాస్ మహారాజ్, కార్గిల్ విజయ వీరుడు, సుబేదార్ మేజర్, హానరరీ కెప్టెన్ , పీవీసీ కమిషన్ మెంబర్ , కార్గిల్ యుద్ధ సమయంలో 17 బుల్లెట్లు శరీరంలోకి దిగిన ఆత్మవిశ్వాసం కోల్పోకుండా కార్గిల్ విజయంలో కీలక పాత్ర పోషించిన భారతదేశంలో సైన్యం లో అత్యున్నత పురస్కార గ్రహీత పరమవీరచక్ర పొందిన యోగేంద్ర సింగ్ యాదవ్ తిరుమల వెచ్చేసిన సందర్భంగా ఎమ్మెల్సీ వంశీకృష్ణ యాదవ్ ఘన స్వాగతం పలికారు. అనంతరం కలియుగ ప్రత్యక్ష దైవం శ్రీ శ్రీ శ్రీ వెంకటేశ్వర స్వామి వారిని దర్శించుకున్నారు . వేద ఆశీర్వచనం , తీర్థ ప్రసాదమును ఆలయ సాంప్రదాయం ప్రకారం అందజేశారు.దర్శన అనంతరం స్వామీజీ కళ్యాణ్ దాస్ మహారాజ్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి పాలనలో అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, సచివాలయ వ్యవస్థను కొనియాడారు.టిటిడి ఛైర్మన్ వై వి సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో తిరుమలలో ప్లాస్టిక్ లేకుండా చేపడుతున్న చర్యలు, నిరంతరం లక్షల్లో వస్తున్న భక్తులకు కల్పిస్తున్న సదుపాయాల గురించి ఆనందం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో శాసనమండలి సభ్యులు వంశీకృష్ణ యాదవ్ మాట్లాడుతూ అయోధ్య హనుమాన్ దేవాలయ పీఠాధిపతి, నిరంతరం ప్రపంచ వ్యాప్తంగా పలువురు ప్రముఖులతో పాటు, దేశ ప్రధాని మోధీ, వివిధ రాష్ట్రాల ముఖ్యమంత్రులు, అనేక మంది మంత్రులు , వివిధ రంగాలలో నిష్ణాతులైన ప్రముఖులు, రాజకీయ ప్రముఖులు సందర్శన తో ఎల్లపుడూ బిజీ గా వుండే కల్యాణ్ దాస్ మహారాజ్ తిరుమల రావడం , శ్రీవారిని దర్శించుకోవడం తో పాటు, తాను ఈ కార్యక్రమంలో లో పాల్గొనడం, కళ్యాణ్ దాస్ మహారాజ్ ను సన్మానించే అవకాశం కలగడం, గొప్ప వరంగా భావిస్తున్నానని శాసనమండలి సభ్యులు వంశీకృష్ణ యాదవ్ అన్నారు .

# చిన్న ఆలోచన విశ్వగతిని మార్చివేస్తుంది

## -నూతన అంశాలను నేర్చుకోవడానికి యువత ఆసక్తి చూపాలి

## ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి ప్రసాద రెడ్డి




ఆంధ్రవిశ్వవిద్యాలయం (విజయభాను న్యూస్): ప్రజల ఆర్యోగం, పర్యావరణ అంశాలపై యువత ఆలోచన చేస్తూ పనిచేయాలని ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి ప్రసాద రెడ్డి అన్నారు. మంగళవారం ఉదయం ఏయూ వైవిఎస్ మూర్తి ఆడిటోరియంలో ఎస్‌టిపిఐ, ఎలక్ట్రానిక్స్ అండ్ కంప్యూటర్ సాఫ్ట్‌వేర్ ఎక్స్‌పోర్ట్ ప్రమోషనన్ కౌన్సిల్, ఏయూ ఆ హబ్ సంయుక్తంగా నిర్వహించిన ఆంధ్రప్రదేశ్ స్టేట్ స్టార్టప్ కాన్‌క్లేవ్‌ను ఆయన ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ యువత మస్తిష్కంలో ఉద్భవించే చిన్న ఆలోచనకు విశ్వగతిని మార్చే శక్తి ఉందన్నారు. ఆర్థిక వృద్ధికి చోదకశక్తిగా యువతరం మారాలని సూచించారు. ఆలోచనే వర్తమాన తరానికి పెట్టుబడిగా నిలుస్తోందన్నారు. భారతీయ గ్రామీణ ప్రాంతాలలో సైతం బలమైన వ్యాపార, నూతన ఆవిష్కరణల మూలాలు ఉన్నాయన్నారు. ఆలోచన మీదయితే మార్గదర్శకం, సహకారం అందిచడానికి మేము సిద్ధంగా ఉన్నామన్నారు. ఆర్థిక సహకారం అందించడానికి, పెట్టుబడిదారులను సమీకరించడానికి పూర్తి సహకారం అందించడం జరుగుతుందన్నారు. సమాజ సమస్యలను గుర్తించడం, అవగాహన పొందడం అలవరచుకోవాలని, తద్వారా వాటిని పరిష్కారాలను చూపడం సాధ్యపడుతుందన్నారు. తరగతిగది బోధనకు అదనంగా నైపుణ్యాలను జోడించడం ఎంతో అవసరమని, దీనికోసం ఇంటర్న్‌షిప్‌లు తప్పనిసరి చేయడం జరుగుతోందన్నారు. యువతను ఆవిష్కర్తలుగా నిలపడానికి అవసరమైన వ్యవస్థను సిద్ధం చేసామన్నారు. ఇంటిగ్రేటెడ్ స్టార్టప్ సిస్టంను అభివృద్ధి చేసామని టెక్ స్టార్టప్, ఫుడ్, ఫార్మశీ, జెనిటిక్, మెరైన్ ఇంక్యుబేషన్ కేంద్రాలను ఏర్పాటు చేసామన్నారు. ఏయూలో ఏర్పాటు చేసిన స్టార్టప్ సెంటర్‌లో 38 అంకుర పరిశ్రమలు తమ సేవలను నిర్వహిస్తున్నాయన్నారు. సాఫ్ట్‌వేర్ టెక్నాలజీ పార్క్ ఆఫ్ ఇండియా సీనియర్ డైరెక్టర్ డాక్టర్ దేవీష్ త్యాగి మాట్లాడుతూ డిజిటల్ ఇండియాలో భాగంగా ఎంటర్‌ప్యూనర్స్‌ను ప్రోత్సహించడం జరుగుతోందన్నారు. సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవడంలో విశాఖ ముందంజలో ఉందన్నారు. దేశ వ్యాప్తంగా 220 బిపిఓలు ఏర్పాటు అయ్యాయన్నారు. ఎస్‌టిపిఐకి దేశ వ్యాప్తంగా 62 కేంద్రాలు ఉన్నాయన్నారు. విశాఖ కేంద్రం రెండు దశాబ్ధాల క్రితం ప్రారంభించామన్నారు.

# డంపింగ్ యార్డ్ గా..."స్మశానవాటిక "



## - పట్టించుకోని కార్పొరేటర్,ఎమ్మెల్యే

## - విశాఖ జిల్లా టిడిపి అధికార ప్రతినిధి కసిపల్లి శ్రీనివాసరావు ఆగ్రహం

గాజువాక (విజయభాను న్యూస్ ) : మనిషి బ్రతికుండగానే ఎలాగూ గౌరవించరు. కనీసం చనిపోయిన తర్వాత అయిన గౌరవించి అంత్యక్రియలు నిర్వహించడం మానవత్వం. గాజువాక నియోజకవర్గం 85 వ వార్డు ఫార్మా నిర్వాసితులుకు సంబంధించిన స్మశానవాటిక పూర్తిగా డంపింగ్ యార్డుగా మారి దుర్వాసన, ప్రమాదకరమైన విషవాయువులు వేదజల్లుతున్నాయని ఇది స్మశానవాటిక లేక డంపింగ్ యర్డా అంటూ విశాఖ జిల్లా టిడిపి అధికార ప్రతినిధి కసిపల్లి శ్రీనివాసరావు ఆగ్రహం వ్యక్తం చేశారు. అసలు స్థానిక కార్పోరేటర్,ఎమ్మెల్యే ఉన్నట్టా లేనట్టా అని మండిపడ్డారు. సాక్షాత్తు 85 వార్డు కార్పొరేటర్ సొంత గ్రామంలోనే ఇలాంటి దౌర్భాగ్యమైన పరిస్థితి నెలకొనడం చాలా శోచనీయమన్నారు.ఫార్మా నిర్వాసితులు గ్రామాలు అయిన లేమర్తి ఆగ్రహారం, కొత్తపాలెం,ఈ. బోనంగి,ఎదురువాని పాలెం, దొప్పవాని పాలెం,పాన్నూరు అగ్రహారం,పానకాలయపేట నిర్వాసితులకు సంబంధించిన కుటుంబ సభ్యులు మరణిస్తే అదే స్మశానవాటికలో అంత్యక్రియలు నిర్వహిస్తారు అన్నారు. గత తెలుగుదేశం పార్టీ ప్రభుత్వ హయాంలో ఇదే స్మశానవాటిక అభివృద్ధి కోసం సుమారుగా 60 లక్షల రూపాయల మంజూరు చేస్తే ఈ వైసీపీ ప్రభుత్వం వచ్చాక దాన్ని రద్దు చేసారని విమర్శించారు.

గత టిడిపి హయాంలో చేసిన అభివృద్ధి పనులు తప్పా ఈ ప్రభుత్వంలో ఎటువంటి అభివృద్ధి కనుచూపు మేరలో కనబడదని విమర్శించారు. గాజువాక నియోజకవర్గంలో ఈ ప్రభుత్వం వచ్చి దాదాపు మూడు సంవత్సరాలు అయిన ,కార్పొరేటర్ వచ్చి దాదాపు ఏడాది గడిచిన సరే ఆ స్మశానవాటిక అభివృద్ధి కి నోచుకోక ఎక్కడవేసిన గొంగళి అక్కడే అన్న చందంగా మారిందని విమర్శించారు. అసలు స్థానిక ఎమ్మెల్యే ఫార్మసీటీ నిర్వాసితుల సమస్యలను తెలుసుకునే సమయం కూడా లేదని ఎద్దేవా చేశారు. జీవీఎంసీ అధికారులు కంటికి కనబడటం లేదా,జీవీఎంసీ నిధులు ఏమయ్యాయి అని ప్రశ్నించారు. జీవీఎంసీ పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. వీధిలైట్లు వెలగవు,డ్రైనేజీలు పొంగిపొర్లుతున్న కనీసం చీమ కుట్టినట్లుగా జీవీఎంసీ అధికారులుకు లేదని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే స్మశానవాటిక ప్రహరీ నిర్మాణం చేపట్టాలని డిమాండ్ చేశారు. నెల రోజుల్లో స్మశానవాటిక అభివృద్ధికి కమిషనర్ చర్యలు తీసుకోకపోతే ఫార్మా నిర్వాసితులుతో జీవీఎంసీ ధర్నా చేస్తామని కసిపల్లి హెచ్చరించారు.

VIJAYABHANU - Visakhapatnam
Editor : B. Chandra Sekhar, Printed and Published by him on behalf of **VIJAYABHANU PUBLICATIONS .,** Published and Printed at **VIJAYABHANU PRESS,** D.No. 9-3-17, Pithapuram Colony, Visakhapatnam - 530 003.
R.N.I. No. 32157/77. Postal Regd. No. J/VM-RNP/32 ⋆ Phone : 2564353, Fax : 0891-2569004 ⋆ e-mail: vijayabhanudaily@gmail.com